నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 5-3-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

లెక్క తప్పింది
కమీజు కుట్టయ్యింది
జోకరు కాకు.

నీరున్న కాడ
కప్పల బెకబెకలు
గెంతడం ఖాయం

ఒకే గెలుపు
అహంకార తుపాను
జాగ్రత్త నేస్తం.

కూల్చడం ఈజీ
కూర్చడం చాల కష్టం
జండా నా ప్రాణం.

డబ్బు తప్పెట
మల్లికాగ పెట్టాలి
నిజం నిప్పులు



– రేడియమ్
9291527757

**శ్రీనిజాలు**

అంతటొచ్చి ఇండియాకు
రాదనుట ఇదిసరేనా?
రానురాను అనుకుంటూ
వచ్చేసింది కరోనా!

మహమ్మారి వైరస్ లకు
భయపడద్దోయ్ వచ్చినా!
చైనా భయపడుతుందా
ఎంతో మంది చచ్చినా?



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## 'ఆప్కారి సూర్యప్రకాశ్ కథలు', 'కాగితం పువ్వు' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో మేక రామస్వామి, కళా జనార్ధనమూర్తి, కవి యాకూబ్, డా॥నందిని సిధారెడ్డి, బైస దేవదాస్, డా॥ కె.వి. రమణాచారి, ఆప్కారి సూర్యప్రకాశ్, కె.బి. అశోక్‌కుమార్

ఆప్కారి సూర్యప్రకాశ్ రచించిన "కథలు", "కాగితం పువ్వు', వచన కావ్యం గ్రంథాల ఆవిష్కరణం–అంకితోత్సవం సభ శనివారం త్యాగరాయ గానసభలో నేటినిజం సంపాదకులు బైస దేవదాసు అధ్యక్షతన జరిగింది. ఇందూరు భారతి, స్నేహ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ. రమణాచారి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిదారెడ్డిలు పుస్తకాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కథనడిపే విధానం ఈ రచయితకు బాగా తెలుసునన్నారు.



ఆప్కారి సూర్యప్రకాశ్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

పాత్రలచేత పలికించే తీరు వైవిధ్యభరితంగా ఉందని, ఆయనకు పాత్రలను నేర్పుగా చూపించడమూ తెలుసునన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా తెలుగు సాహిత్య రంగానికి పలు రచనల ద్వారా సేవలందిస్తున్న సూర్యప్రకాశ్‌ను అతిథులు అభినందించారు. నలభై ఏళ్ళ క్రితం రాసిన కథలు, కవిత్వం మళ్లీ పునర్ముద్రించడం ఆనాడు ఈనాడు పరిస్థితుల్లో మార్పేమీ కనిపించడం లేదని తన రచనల ద్వారా తెలుస్తోందని సభకు అధ్యక్షత వహించిన బైస దేవదాసు అన్నారు. సభలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, రచయిత కేపీ అశోక్ కుమార్, కవి యాకూబ్, కె. సుధాకర్‌రావు, మేక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## "ధనికొండ" కథా సాహిత్యంపై సదస్సు



ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో 'ధనికొండ హనుమంతరావు కథా సాహిత్యంపై ధనికొండ హనుమంతరావు శతజయంతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులలో మాట్లాడుతున్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ. వేదికపై కే. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, మాట్లాడుతున్న ధనికొండ చిన్న అల్లుడు రఘురామశర్మ, గోపరాజు సుధ, ధనికొండ శ్రీధర్, ఏల్లూరి మురలీధర్, మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు.

## విశిష్ట వ్యక్తులకు వాగ్దేవి పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో అతిథులు.

బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై వాగ్దేవి సంగీత నిలయం జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విశిష్ట వ్యక్తులకు వాగ్దేవి పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. సభకు ముఖ్య ప్రముఖ ఆడిటర్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా ప్రముఖ కథక్ కళాకారుడు, పండిట్ అంజాబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, టాక్స్‌బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాసరావు, రచయిత సయ్యద్ జానీబాషా, న్యాయవాది వీవీ శ్రీనివాసరావు, ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, రామరాజు లక్ష్మి శ్రీనివాసులు, ఎస్ అన్నపూర్ణ (పరిపాలన), పాటిబండ్ల జానకి (సంగీతం), డాక్టర్ నన్నపనేని విజయలక్ష్మి (రచన), డాక్టర్ ఎవిఎస్ కృష్ణ మోహన్ (సమాజ సేవ), కమిలిశ్రీ (జర్నలిజం), డాక్టర్ అపర్ణ ప్రసాద్ (నృత్యం), లక్ష్మీ సామ్రాజ్యం (మహిళ స్వీయ రక్షణ, శిక్షణ), విజయ్ ఫోటో గ్రాఫిలకు వాగ్దేవి పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

## న్యూస్ ప్రజెంటర్ త్రిమూర్తులకు కళారత్న బిరుదు



దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించే దిశగా తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ, పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజబుల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ దివ్యాంగ్ కళాయాత్ర ముగింపు వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా గత సోమవారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అంబర్‌పేటకు చెందిన దివ్యాంగుడైన దూరదర్శన్ క్యాజువల్ న్యూస్ ప్రజెంటర్ త్రిమూర్తులను పలువురు ప్రముఖులు వంశీరామరాజు, సామాజికవేత్త డా॥ కొత్త కృష్ణవేణి, కొత్త శ్రీనివాస్, దైవజ్ఞశర్మ, కేశవన్ సుందరమూర్తి తదితరులు కళారత్న బిరుదు అందజేసి గనంగా సత్కరించారు.



పంచరెడ్డి లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న ఘనపురం దేవేందర్ తదితరులు.

## మేడిశెట్టికి మధునాపంతులకు పురస్కారం



మేడిశెట్టి తిరుమలకుమార్‌కు మధునాపంతుల స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డా॥కె.వి.రమణాచారి, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ రాపాక ఏకాంబరాచార్యులు, సాధన నరసింహాచార్యులు, ఆచార్య టీ. గౌరీశంకర్.

సాహితీవేత్త డాక్టర్ మధునాపంతుల శతజయంత్యుత్సవ సంఘం ఆధ్వర్యంలో మధునాపంతుల శతజయంత్యుత్సవ ముగింపు సమావేశం గానసభలో జరిగింది. ఈ సందర్భంగా సాహితీవేత్త మేడిశెట్టి తిరుమలకుమార్‌కు మధునాపంతుల స్మారక సాహితీపురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కేవీ రమణాచారి హాజరై పురస్కార గ్రహీతను అభినందించారు. జీవితమంతా సాహిత్యానికి అంకితమైన జీవితం మధునాపంతులదని డా॥ రమణాచారి అన్నారు. దిగ్గజాలైన నాటి సాహితీమూర్తులకు తనదైన విమర్శతో ఆలోచింపచేసిన సాహితీమూర్తి మధునాపంతుల అన్నారు. రచయిత్రి అకొండి రత్నకలికి మధునాపంతులు స్థాపించిన సాహితీపత్రిక 'ఆంధ్రి' గూర్చి సమగ్రంగా వివరించారు. డా॥రాపాక ఏకాంబరాచార్యులు, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆచార్య టీ. గౌరీశంకర్, సన్నిధానం నరసింహాచార్య, మధునాపంతుల కిరణ్, శేఖర్, ముదిగొండ శివప్రసాద్, జీ. సంధ్య, డా॥ ఆశావాది ప్రకాశరావు, డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ, డా॥ రాధశ్రీ, చిమ్మపూడి, డా॥ ఆచార్య ఫణీంద్ర, డా॥ రాంబాబు, సత్యప్రసాద్, ఆచార్య వేణు, పరమేశ్వరి, వాణీకుమారి, మధునామూర్తి, శర్మ, శేఖర్, సాధన నరసింహాచార్య పాల్గొన్నారు.

## 'ఇసిత్రం' కవి పంచరెడ్డి లక్ష్మణ్‌కు సత్కారం

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని హరిదా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ కవి పంచరెడ్డి లక్ష్మణ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ మాండలికంలో ఇసిత్రం కవితా సంపుటిని అందించిన లక్ష్మణ్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. మనదైన భాష, యాస, పదాలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, దశరథ్ కొత్మీకర్, నరేశ్ పాల్గొన్నారు.

## అదిగో..! ఢిల్లీ మండుతోంది..! మండుతోంది..!

పొలాలు పచ్చగా ఏపుగా ఎదిగి వున్నాయి
ఏ సంగీతానికో ఆ కంకులు తలలూపుతున్నాయి
శ్రుతిబద్ధంగా యువతుల కాళ్ళు
అరుగులపై ఆడుతున్నాయి
అశోక వృక్షాలు దారి పొడవునా చారిత్రక గుర్తులు
జొన్న చేలో మంచె మీద ఒక యువతి వడిశెలతో
రాయి మబ్బుల వేపు విసురుతుంది
ఆ దేవాలయంలో పడతులు కూచిపూడి నాట్యం
ఆంగిక వాచకాభినయంతో చేస్తున్నారు
ఆ దర్శకుడు శృంగార దృశ్యాలు
వెయ్యి బల్బుల కాంతిలో తీస్తున్నాడు
హీరో ఎవరో ముస్లిం యువకుడు!
యువతి బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చింది
కళకు మతం లేదు కదా..!
అక్కడ శివునికి దీపారాధన జరుగుతోంది
అన్ని గుడుల్లో దీపాలు వెలిగించడానికి
ఎంతో నూనె ఖర్చవుతూనే ఉంది
మరోప్రక్క, గుండె దీపాలు మాత్రం వెలగడం లేదు
శివుడు శూలం పట్టుకున్నాడు.. ఢమరుక ధ్వని చేశాడు
పరశురాముడు గండర గొడ్డలి పట్టుకున్నాడు
క్షత్రియుల తలలు తీశాడు
రాముడు విల్లంబు పట్టుకున్నాడు
రావణుణ్ణి పొట్ట క్రిందకు బాణం వేశాడు
యుద్ధ నీతి తప్పాడుమరి!
కృష్ణుడు సుదర్శన చక్రం విసిరాడు
శిశుపాలుని కంఠం తుంచాడు.
క్షత్రియుల అండతో మరి!
ఆధునిక రామకృష్ణ అవతారులు
ఈనాడు తుపాకులు పట్టుకున్నారు
ఢిల్లీ నడివీధుల్లో
భారతీయుల గుండెల్లో తూటాలు దించారు
గృహ దహనాలు చేశారు
రాష్ట్రాలన్నింటా మంటలు రేగాయి
సామూహిక హత్యలకు పాల్పడ్డారు
హిందూ మతోన్మాదం అగ్గిగా రగిలింది
విచక్షణను కోల్పోయింది
దేశానికి సంస్కృతినిచ్చినవాడి గుండెలు చీల్చారు
అదిగో ఢిల్లీ మండుతోంది.. మండుతోంది..!
అవును! ట్రంప్ వచ్చాడు
నీవు తాజ్‌మహలేకదా చూపించావు?
ఎర్రకోటనే కదా దర్శింపచేశావు?
నీ దేవాలయాల మీద
బూతు బొమ్మలు చూపించలేకపోయావుగా!
ముస్లీమ్‌లు భారతీయులే కదా!
మొగలాయి రాజుల నిర్మాణాలే కదా!
ఈనాటికీ భారతీయతకు గుర్తులుగా వున్నాయి!
మీరు అగ్ని గుండాలు పేర్చారు,
యజ్ఞ యాగాలు చేశారు,
జంతు బలులు చేశారు, నరమేధాలు చేశారు,
భారతీయ నదుల్లో నెత్తురు పారించారు
మీరు వర్ణతత్వం తెచ్చారు
దేశీయులను అస్పృశ్యులుగా చేశారు
సోమరులకు జంధ్యం వేశారు
దేశ సంపదను దేవుళ్ళ పేర దోచారు
అంతకంటే మీరు ఏమి చేశారు?
అంబేద్కర్ జీవించే హక్కును తీసుకొచ్చారు
మనుస్మృతి దహనం చేశారు
'వేదాలు అభారతీయం' అని చెప్పాడు
'బ్రాహ్మణ్యం' దోపిడీ శక్తులని చెప్పాడు
అయినా! మీ నెత్తుటి స్నానాలు సాగుతున్నాయి
'కలకత్తా కాళికా దేవికి పిల్లల్ని బలివ్వడాలు' ఆపారా!
దొంగ బాబాల స్వాములతో
వ్యభిచార కేంద్రాలు నిర్వహణలు ఆపారా!
ఏ విదేశీయునికి మీ గర్భగుడి చూపిస్తారు?
రాళ్ళకు నగీషులు చెక్కారు
పట్టు వస్త్రాలు ధరింపచేశారు
శ్రమజీవిని చింపిరి వస్త్రాలతో నిలబెట్టారు
ఇదా మీ సంస్కృతి! మీ పాలన!
మళ్ళీ అంబేద్కర్‌వాదులు
రాజ్యాంగ ప్రతిని చేబూనుతున్నారు
నీలి జెండాలు ఎగరవేస్తున్నారు
ప్రజ్వలన శక్తులై మండుతున్నారు
దేశీయులంతా ఏకమవుతున్నారు
హింసావాదులకు అపజయం తథ్యం
బౌద్ధ జీవులకు విజయపతాక
బౌద్ధ భారత నిర్మాణం ఈ యుగ సంకేతం..!



– కత్తి పద్మారావు
సెల్:9849741695

### ఎంత విడ్డూరం

అనుకున్నదే
జరుగుతూ ఉంది
కల్వర పడినదే
కనుల ముందు
కానవస్తూ వుంది
నిరర్థక చర్యలతో
విద్వేశ ప్రసంగాలతో
హింసాగ్ని రాజేసి
దేశ రాజధాని
నడిరోడ్డుపై
రక్తపు టేరులుపారిస్తున్న

మతత్వంతో
మానవ సమాజాన్ని
మధ్యయుగాల నాటి
చీకటి కోణాల్లోకి
నెట్టాలని చూస్తూ వున్నా
పసిగట్టలేని న్యాయవ్యవస్థ
నిస్సాహాయతతో
ఉదాసీనతతో
మౌన ప్రేక్షకుడిలా వీక్షించడం
మతిహీనపు చేష్టలతో
హింసోన్మాదంతో
చెలరేగే ముష్కర మూకల
ఆటలను కట్టించి
రాజ్యాంగ విలువలను
సెక్యులర్ ఆదర్శాలను
శాంతి భద్రతలను కాపాడుతూ
భయాందోళనలను తగ్గించి
శాంతియుత సహజీవనానికి
సామాజిక సామరస్యానికి
బాటలు వేయాల్సిన పాలక పక్షమే
బాధ్యతలను మరిచి
ఘర్షణలకు తావివ్వడం
విద్వేషాగ్ని ఎగదోయడం
ఎంత విడ్డూరం..
(ఢిల్లీ సంఘటనలకు
స్పందనగా..)



– డా॥ సమ్మన్న ఈటెల
సెల్: 9885238654

### విశ్వనరుడా వినలేవా

హింసోన్మాదం గల్లీలన్నీ పాకుతుంటే
దారులన్నీ బావురుమంటున్నాయి
అడుగులన్నీ రక్తపుమడుగులవుతుంటే
చుట్టూ దుఃఖపు ఏరులేగా మిగిలేది

కారుణ్య పతాకాన్ని చేబూని ఎన్నాళ్ళయింది మనిషీ
మనసో మాలిన్య కాసారమై
మరణమృదంగాన్ని మోగిస్తుంటే
గుడిగంటలూ చర్చిబెల్స్ మసిదులోని అజా
యుద్ధభేరీలేగా అయ్యేది
బూడిదే గా మిగిలేది

నరుడా..విశ్వనరుడా..
అనికీర్తిస్తుంటారు కదా నిన్ను
సృష్టికే ప్రతిసృష్టి చేస్తావని
కీర్తిస్తాం..సంబరపడుతుంటాం
ద్వేషాన్ని దాచుకున్న నీ గుండె
విద్వేషాన్ని వత్తిచేసి పగనే వెలుగు చేసింది
పగటి వెలుగు మాయమైంది

మనిషంటే కలకండ పలుకున్నాం
పరమదయాళువనుకున్నాం
కానీ పళ్ళునూరుతూ పరమతసహనాన్ని కాల్చేసే
కళ్ళున్న కబోదనుకోలేదు...
రావయ్యా మనిషీ నిద్రించిన ఋషిని లేపవయ్యా
కుళ్ళును కడిగేసి
నీజటాజుటంలోంచి మానవతా గంగను జారవిడిచి
మసిబారిన మతాలను కాస్త కడిగేయాలి
నరుడే హరుడని నిరూపించు
వింటున్నావా లేదా
ఓ విశ్వమానవుడా...



–సి.యస్.రాంబాబు
9490401005

### రక్త చరిత్ర

మడత పెట్టిన మతాల్ని
ఎవరో తెరిచి
మంటల వైపు విసిరారు
డిల్లీ నుంచీ గల్లీ వరకూ
రగులుతూనే ఉంది
రక్త సిక్తంతో రోడ్లన్నీ
ఎరుపు రంగుని పులుముకొని
రోదిస్తున్నాయి...
మతం మంటలు లేపిందెవ్వరు?
మనిషిని మనిషి కాదని
కారుకూతలు కూసిందెవ్వరు?
మతమే మనిషి చిరునామా
అని వాగిందెవ్వరూ?
మనిషి మనిషిని మరుస్తూ
కులాల కుంపట్లు రాజేస్తూ
రాజకీయ కనుసన్నల క్రీనీడలు కమ్ముకొంటూ...
యుద్ధ మేఘాలు డిల్లీ నడి వీధుల్లో
ఆర్తనాదాల ఆఖరి కేకలు వినిపిస్తూ...
అమాయకుల కన్నీటికి కారకులెవరు?
కల్లోల కపట సూత్రధార లెవ్వరు?
మతం మతం అంటూ
మనిషి మనుగడ ను సవాల్ చేస్తూ
రక్త చరిత్రను లిఖిస్తోంది ఎవరు?
ఎవరక్కడ..?
ఇంకా ఆరని మంటలకు ఆజ్యం పోస్తూ
ఆనందిస్తున్నది...



–మహబూబ్ బాషా చిల్లెం
9502000415

### ఉద్రిక్తతలు మళ్ళీ మళ్ళీ

ఎవరు ఎవరకూ చట్టం
ఎవరు ఎవరకూ చుట్టం
ఎవరు ఎవరకూ పక్కం
ఎవరికి వారే స్వార్థ చిత్తం
భారతదేశ రాజధాని
ప్రజా ప్రతినిధుల వాణి
రాను రాను చేలరేగుతుంది
అల్లర్లతో హింసలతో
ఉద్రిక్తతలతో డిల్లీ మళ్ళీ మళ్ళీ
మొన్న చలిగాలుల వణుకు
నిన్న ఎన్నికల గెలుపుల మిణుకు
నేడు ఈశాన్యమున లొల్లిల బెణుకు
సంస్కృతి సాంప్రదాయల కలబోత వల్లి
జాతి మతల ఠాగూర్ గీతల భారత తల్లి
అనాలోచిత చర్యల చట్టసవరణల లొల్లి
పెరుగుతుంది అందరిలో అంతర్గతంగా మళ్ళీ
'పౌరసత్వం' అమలు ఓవైపు ఖరారు
వద్దు వద్దని రద్దు కోసం ఓవైపు 'పోరు'
వ్యతిరేక పవనాలు వీస్తుంటే
రెచ్చకొట్టే ప్రసంగాలు ధ్వనిస్తుంటే
హింసాత్మక సంఘటనలు మొలకెత్తున్నయ్
రాళ్లదాడులతో మొరుపులు కనబడుతున్నయ్
క్షతగాత్రులు దవాఖానలో
కదలలేని శరాలు సమాధిలో
వరుసలు సంఖ్య పెరుగుతోంది
ప్రేమ వాసనలు తెలియక
బతుకు ఆశలు చిగురించక
ఎన్నో అడుగుల నెత్తురులు పారి
ప్రాణం వాసనలతో పరుగులు తీస్తున్నయ్!
మేధావుల మాటలు రాలి
పూర్తిగాని అక్షరాల తోటలు
బీటలువుతుంటే
మౌనంగా చెవిలో పడిన ఆదేశాలకోసం
వృత్తి దర్మమునకు లోబడి
రక్షక దళాలు విధులకోసం
మనసులేని యంత్రాలను
మనుషులపై కాల్చివేతల రాతలను
కాన్వాస్ మీద తూటాల
సంతకం చేస్తున్నయ్!
అభాగ్యులైన ప్రాణాలు
ఉద్రిక్తతలతో
గాల్లోకి కలుస్తున్నయ్!!



-పగిడిపల్లి సురేందరు పూసల
9290701508




## స్థితి-వర్తమానమే !

'సమాజమే జీవనాన్ని
అతలాకుతలం చేస్తున్నది!'
అవిశ్వాసం
అమానవీయ ధోరణి
ఆర్థిక వ్యామోహం
అనాధ్యాత్మిక చింతన
అస్పష్ట జీవనవిధానం
దారి తెలియనితనం
రక్తపరీక్షల్లో
అన్ని కణాల అసమతుల్యత
రోగనిర్ధారణని అనర్థం చేస్తున్న ప్రాణశక్తి; త్రాణ!

బతుకు–
అర్థవంతం కానిదంటూ,
లక్ష్య రాహిత్యాన్ని నమ్ముతున్న తరం
మౌలిక విలువల్ని హేళన చేస్తున్న మేధావితత్వం
జ్ఞాన సాధనను గేలిచేస్తున్న రాజకీయం
విజ్ఞానశాస్త్ర ధిక్కరణకి
జైకొడుతున్న నవీనత్వం
వెరసి
'నిహిలిజం'కి పట్టం
అన్ని రంగాల 'పునర్మూల్యాంకనం'
అన్ని భావప్రక్రియల 'పునర్నిర్మాణం'

'పెద్దనోరు'కి గజమాల'!
'సమూహక్రసీది' అనర్గళ గళం!

సమాజ సంక్షోభ కల్లోలంలో
'వ్యక్తి'–'త్వం'–వికసనం???
అది కావాలి
జీవుని చింతనం
చిరవాంఛిత ఆచరణం !!

## ఏకాంత వృక్షం

బతుకు ముంజేతి కంకణం కదూ!
ఎవరి బతుకు వారిది
ఎవరి బతుకు వారికి ఘనం
ఎవరి బతుకు వారికి ధనం
ఎవరి బతుకు వారికి విలువ
ఎవరి బతుకు వారికి
వారే కుట్టించుకున్న వలువ
ఎవరి 'వేలిముద్ర' వారిదే!

తిర్యగ్జంతువులకు తిరిగే 'రీతి' గొప్పది
మానవాళికి సామాజిక 'నీతీ',
నడతలో 'ప్రీతీ' గొప్పవి!

ఉన్నతత్వం, ఉత్తమత్వం
తాత్కాలిక కోరికలేం కావు
విలువలు మారుతాయట!
అది ఎప్పుడూ అర్ధ సత్యం!
తత్త్వజ్ఞత, ఆశయం, సత్యమూ– చిరంతనం!

అభ్యుదయ ఫలసిద్ధి వైపు
చలనం – గమనం – పయనం లో
చిత్తశుద్ధిదే గెలుపు!

ఒకరి జీవితం వేరొకరి చేతిలో
ఆటవస్తువు కా(రా)దు

ఒకరి జీవితం వేరొకరి చేతిలో
తెల్లకాగితం కా(రా)దు

ఎవరి బతుకు వారికి వాస్తవం
ఎవరి బతుకు వారికి అమృతఫలం!
ఎవరి బతుకు – అది –
వారికే చెందిన
అద్భుత చరితం!




## బొడ్డూడిన శిశువు

**శీర్షోదయమైంది**
**శిశువు నేలపై బడింది**

ఒక 'మాయ'ను ఛేదించుకొన్న
కష్ట పరంపర....
విచిత్రంగా –
మరొక 'మాయ'లోకి ఉచిత ప్రవేశం!
కన్న పేగుకు ధన్యత్వ స్పృహ
ఆనందం, సాఫల్యం, సంతృప్తి!

శిశువులో శ్వాస... చలనం...
బొడ్డు కోస్తే 'ఏడుపు'
గుప్పిట తెరిస్తే 'లోకం'
నోరు పెగిలింది
ఇక ఒకటే రొద! చుట్టూ హెూరు!!

తల్లి గర్భంనుంచీ
తప్పనిసరిగా 'జన్య' కణాలు
అనివార్యపు ఆనువంశికం,

ఆదరణం నుంచీ
వాతావరణం నుంచీ
శతకోటి కాలుష్యాల జనగణ గణగణలు
భౌతిక, బౌద్ధిక, మూర్త, అమూర్త

ప్రకంపనల ప్రతిఫలనాలు
'కట్టడి'కీ 'కట్టుబడి'కీ పదార్థాలు
ఎదుగుదలకి శ్వాసన (శాసిత)
ప్రతిబంధకాలు!

బుడి బుడి నడకలోనే – మడీ, గుడీ, బడీ
బోసి నవ్వుకేం తెలుసు – హంగూ ఆర్భాటం
చక్రనేమిక్రమ వ్యూహం
పద్మవ్యూహాల మోహం!
నిర్మలంగా హసిస్తాయి పెదవులు
ముఖాన్ని అద్దం చేసి, చూపి, మరీ
'స్వచ్ఛత'కి నిర్వచనం చెబుతాయి
తన ముందున్న వారినందరినీ
దీపశిఖముందు వెన్న ముద్దల్ని చేస్తాయి!

అప్పుడు – భూమీ,
భూమిలోనివీ, భూమిపైవీ కూడా
సమస్తం –సకలం– సర్వం –
అన్నీ తనవే !

చేతులూ కాళ్ళతో
గాలిలో బంతి ఆట
పీకలో చామంతి పాట!

గోరుముద్ద తినిపిస్తూ అమ్మ
చిటికెన వ్రేలితో అడుగులు వేయిస్తూ నాన్న
కదిలే దైవాలు
(రుచి) (చూపించిన) వాటన్నిటినీ
ఆరగించుకున్న నాడే
ఆకళించుకున్న నాడే
ఒక ఆలోచితుడు, ఒక ఆచరితుడు
కూకటి వేరుని కూడగట్టుకున్నాడు!

వాడు చెఱువుగట్టుపై లేస్తున్న సూరీడు
రావి ఆకుల్లో చిక్కుకున్న చందమామ!

నీరూ ఆహారం
ప్రధాన జీవన ద్రవ్యాలు
మంచి మాట, చిన్నచేత
సుగుణనైపుణ్య ద్వయం
దోసెడు గుళ్ళకరాళ్ళ కన్నా
ఒక్క పిండిగోలీ మేలు
ఇది రాయిస్తుంది
రాసిన దాన్ని మెరిపిస్తుంది!

అమ్మా నాన్నా అందించేవీ
అందించి పదిలం చెప్పేవీ
రేపటి బంగారు పళ్ళేనికి ఈనాటి గోడ చేర్పు
ముంగిలి తోరణానికి ముత్యాల కూర్పు
నడకకీ, నడతకీ సుబోధక మిచ్చే నేర్పు!!

## చదువూ..చట్టుబండలూ

**వస్తు తయారీపోయి**
**సేవారంగం తయారైంది**

చదువు... చదువు...
పరుగు... పరుగు...
పోటీ... పోటీ... పోటీ...
నేనే నంబర్‌వన్!
కాకుంటే.. డాలర్లు లేవు...
లేకుంటే.... రూకలు చెల్లు!
వెన్నెముక వంగుతోంది
ఉదరం, అవయవాలూ చివుకుతున్నె
నిద్ర 'మోహం వాచిపోతోంది'!
ఆహారం? దొరికింది గతుకుతోంది
అన్ని శోధనలకూ, సాధనలకూ
ఈనాటి అవసరమే భూమిక!

ఏ వంటగదీ ఇద్దరు వంటకత్తెలకు చోటివ్వదు
ఒర ఒక్కటే... కత్తులు 'నూరు'!
అర్హతా వజ్రాన్ని నైపుణ్యంతోనే కొయ్యాలి

'మార్క్' రేపటి పేండొరాబాక్స్ 'కీ'
'ర్యాంక్' ఈనాటి 'పేకేజీ' పిలుపు!
ఇదే కుహనాతర్కం!

విద్య నిర్వచనాన్ని
వివేకంలో, విజ్ఞతలో, విజ్ఞానంలో వల్లె వేస్తేనే
మెదడులో నిలుపుకుంటేనే సమగ్రత,
అసలు సిసలు జ్ఞానైకత్వం–
సంపూర్ణ ప్రయోజనం! 'వికసనం'!!

## వచ్చీరాని వయస్సు – బేరసారం

కౌమారం
పాలూ నీరూ తేడాలెరుగదు
ఉరకలు వేసే ఉత్సాహం
సెలయేటి గలగల
మిథ్యకూ రథ్యకూ మధ్యన
సన్నటి గీత
ఉంటే ఉంటుంది
కొండొకచో
ఉద్వేగంలో ఊడ్చుకుపోతుంది

ఈస్ట్రోజన్, ప్రొజెస్ట్రాన్, టెస్టోస్టిరాన్
వాటి మాయాజాలం
వ్యామోహాల గాలం!

తనువూ మనసూ
ధ్యాసా భాషా
అన్ని ఆకర్షణలూ
చూపులకు మీనలోచనాల్ని అంటిస్తాయి
అంతా 'సమ్'చలనం'!

అంతా తెలిసీ తెలియని వెంపర్లాట
మనసేమో అలంగం తిరిగే కాలు గాలిన పిల్లి
పదిమంది మధ్యన ఉండీ– ప్రవాసం!
ప్రపంచమంతా 'అరచేతిలోనే'
అయినా ఏదీ అందదు !
అరసున్నలూ, కామాలూ, గామాలూ, తీటాలూ,
శ్లాష్‌లూ, హాష్‌లూ... మానసంలో చిప్పిల్లే ఆశలు
మెదడు పంజరంలో కోర్కెల చిలకలు

అంతటా – ధిక్కార ధోరణి
అందరి 'ఇతవు' పట్ల – అనాదరణే, అనాసక్తే
ఉదాసీనతే! 'ప్చ్' పెదవి విరుపే!

'డైనమిజమ్' – రెండంచుల కత్తి
పొగరు – పట్టాలు తప్పబోయే రైలు
బుద్ధి – మొద్దబ్బాయి
అన్నిటా అనైక్యత
ఏ హెచ్చరికనీ చేయవు
అసలవి తమ 'లో' తామే బందీలు!

'గుప్త' విజ్ఞానానికి మనసు పీకుతుంది
అంతా 'తృష్ణ', 'తృప్తి'
'మధు' రంగా
చదివిందే చదువుతుంది
బాహ్యాంతర, సామాజిక, మోహాత్మక
అద్దెగదులు–
'మనిషి' 'అర'మరకలు
నడక కాదది పొరాట
జారుడు మెట్లపై ఆట!

'పుస్తక ప్రదర్శనం'
లోపలి అక్షరాల
తుట్టతుది సందిగ్ధాల పట్టుబట్ట
దారి కనుక్కోమనే
తేనెతుట్ట!

చూపుల్ని ఏ 'పంక్తి' రథం ఎక్కించినా
కళ్లబడేవి–
ముళ్ళూ రాళ్ళూ పల్లేళ్ళూ జిల్లేళ్ళూ..

చూసి చూసీ, తిరిగి తిరిగీ
బుర్ర గిరుకునే వేళ్ళు



## ఆకర్షణలూ... అవసరాలూ...

అన్ని ఆకర్షణలూ
గుండె మట్టిని కుళ్ళగించే
కోరికల వానపాములవుతాయి

అవసరాలకు బానిసవైతే –బతుకు
అటు ఇటూ మూసిన సొరంగం
అందులో పిల్లివి నువ్వు
ఎప్పటి పనిని అప్పుడే చేసేస్తే
మనసులో ముళ్ళుండవు!
శుచీ శుభ్రతా కలిగిన ఆహారం తింటుంటే
కాసెగట్టి గోదాలోకి సిద్ధం!

కాళ్ళ ముందు పల్లేర్లు చల్లుకోకుంటే
రహదారి 'సాఫీ'యే
పాదం మృదువుగానే ముందుకు సాగుతుంది!

భ్రమలూ, భ్రాంతీ
ఎక్కడో ఒకటీ అరా మిణుగురు
దాని ఊసు–'తప్పనిసరి' 'తద్దినం'!

అటూ ఇటూ
కుడిఎడమల ఎటుచూసినా
కన్నుగీటే ఆకర్షణలు
వ్యా'మోహం' రెప్పపడనీయదు

ఆరని దాహం... తీరని ఆర్తి
గుండె – గుప్పిట్లో ఉండలు చుట్టిన రావు
మనసు – పిండాలు పెట్టేరేవు !

శాంతి– నిఘంటువుల్లో కెక్కని గ్రామ్యం
ఇల్లు– శవం లేచిన వసారా
లేదంటే– కుమ్మపొగలో రెల్లు గుడెసె!
నీకు కాని ఆలోచన
నీకు(గా)(కా)వలసిన లోచనాన్నివ్వదు

'అది కావాలి' 'ఇది రావాలి'
ఆలాపన ప్రేలాపన కూరికూరి
గుండెని ఏకుల బుట్టని చేస్తాయి
మెలిపెట్టి మెలిపెట్టి పిండిపిండి
మనసును తడితుండును చేస్తాయి

ఆలోచనా 'సరళి'
అది ఆగి చావదు
అంతా వంకరటింకర 'ఓ'
కేంద్రం కనపడని
'పిచ్చి' గీతల చీకటిపెద్దమ్మ
నెత్తిమీద మొత్తుతుంది!

ఆశ కేన్సర్‌ని జయించింది
ఇంకా వెలువడని పరీక్షా 'ఫలితం' మాత్రం
ఎండ్రిన్ తాగించింది,
వ్యత్యస్తాలూ విపర్యయాలూ వికృతులూ
అంతా – మానసిక రోగ క్రీడ
అది భూతాల్నే చూపుతుంది
లేదా వెంట్రుకకు భూతద్దాన్ని పడుతుంది
క్షణం ఆలోచిస్తే !
సూర్యుడు అరచేతిలోకి చిక్కిపోతాడు!
ఇక అంతా వెలుగే!
సమాజం ఎప్పుడూ
కొండా కోనల్లో అడవి
వ్యక్తి ఎల్లప్పుడూ
సమూహంలో ఒంటరి
'నీ చావు నీదే – నీదే; మరియూ నీదే'!

అది ఎప్పుడూ ఏకస్థితి; ఏకైక 'మతి'!
దాన్ని పట్టుకోవాలి; దాన్ని విప్పుకోవాలి

అడుసులో కాలేయకుంటే
ఏ బురదా అంటుకోదు
మిథ్యావసరం – ఒత్తిడి
ఆశమారాటం – చిత్తడి!

ఎగరలేని రెక్కలు
పిల్లి నెత్తిన వేసిన నేతిచుక్కలు!

ఎన్ని సిద్ధాంతాల్నీ రాద్ధాంతాల్నీ
మథించినా, గ్రథించినా
ఎంత వాఙ్మయాన్నీ, వాక్మాయల్నీ
నమిలినా, నెమరువేసినా
అందే అంతస్సారం ఒక్కటే
'నిత్యానిత్య వివేకం
'వ్యక్తి' – 'త్వం' – ని నిలబెడుతుంది'!

## ఆత్మన్యూనత

తీసివేతలూ, కొట్టివేతలూ
అరికాళ్ల కింది మంట
చేసినదానిని గురించి 'సందేహం'
తప్పులేమున్నాయోననే 'జోరీగ'
లోపిరికీ వెలిపిరికీ

సూటిగా నిలవదు చూపు
అడుగు తడబడి తనను తాను తట్టుకొంటుంది




**డా॥ఎన్. గోపి అన్నట్టు "ఈ కావ్యం నిండా ఒక మంచి మనిషి నుంచి వెలువడే మంచి మాటలు ప్రకాశిస్తాయి. ఆ ప్రకాశంలో ప్రేమా, మానవత్వం, వాత్సల్యం, పెద్దరికం, వ్యక్తి ద్వారా వర్షించే విశాలమైన విశ్వ శ్రేయస్సూ అన్నీ వున్నాయి". విహారిగారి రెండో దీర్ఘ కవిత ఈ "చేవ్రాలు" మార్చి 8న ఆవిష్కరణ సందర్భంగా నేటినిజం పాఠకుల కోసం...**

–సంపాదకుడు.

ముందుకు మూడూ, వెనక్కు ఆరూ!
సమయం గుండెమీద గుయ్యారమౌతుంది

వయసు బాధ
మోయక తప్పని బండకొయ్య!
మనసు వ్యధ
సాగదీయక తప్పని గుండె కమ్మెచ్చున తీగ!

విశ్వమంతా కలిసి
నన్నే ఒంటరిని చేసేసిందనే కసీ, ఆక్రోశం

ఏకంగా పుట్టుకనీ, వారసత్వాన్నీ
పరిస్థితుల్నీ, పరిసరాల్నీ
బూతులు తిట్టే తెంపరితనం
నిస్సహాయపు నీలుగు
చివరికి ఏమూలనో
ముడుచుకు పడుకున్న మూడంకె!

నలుగురిలో నువ్వొక్కడివే
ఏకైక మరుగుజ్జువు ఏమీ కాదు....
అసలు అభావదారిద్ర్యమే
వికృత వ్యక్తి'త్వ'ం కారణం!

## 'ఒత్తి... ఒత్తి.. పలికితే... ఢీ'

అనుకున్న పని
అనుకున్నట్టు
అనుకున్నప్పుడు
'జరిగి చావదు'
కాదు, కాదు
జరుగుతూనే ఉంటుంది, నడవదు!
అది ఆక్టోపస్ కదలిక!

ఆకారమేమన్నా సాకారమవుతుందా? – లేదు
మరికాస్త వికారం... ఓకరింపు.. వాంతి!

తలనరాలు పెటపెటలాడుతూ ఉంటాయి
'మైగ్రేన్' అంటుంది–ఐదొందల కన్సల్‌టేషన్ ఫీజు!
ఆరొందల ప్రిస్క్రిప్షన్!

బలవంతంగా
ఏ స్వామీజీ ప్రవచనం ముందో నిలబెడుతుంది
అంతలోనే
'ఇక చాల్లే పద' అంటుంది కాలు!
అద్దంలో ఆముదం తాగిన మొహం!

'పేరాసింపథటిక్ నెర్వస్ సిస్టమ్'
తన పనిలోకి తాను దూకుతుంది!
ఉన్మత్తత! 'చింత', 'చితి'!
ఆకాశంలోని మినుకులూ, తునకలూ
స్వకీయం, స్వయంకృతం!

దుఃఖాల కొండాలేదు
బాధల సముద్రమూలేదు
అంతా గాలిలో బంతిలేని సయ్యాట!
కావలసింది నేలమీద నడక!

ఆలోచనని సవ్యంగా పక్కకి లాగకుంటే
ఛలో... ఛలో...
మెదడూ పెడబుద్ధికీ
అవయవాలూ తప్పుడు అభ్యాసానికీ!
'పెక్కు భంగులు వివేకభ్రష్ట సంపాతముల్'!

## భ్రమ విభ్రమ భ్రమణం

**ప్రతికూల భావం** చాపకింది నీరు
క్షణ క్షణానికీ నీటిమట్టం పెరుగుతూనే ఉంటుంది,
ముంచేస్తుంది!

అది
పొలిమేర చేరి, పొంచివున్న శత్రువు
ఆదమరిస్తే దినచర్యపై దాడిచేస్తుంది
గుండెకోటను లొంగదీస్తుంది

'ఏ ఒక్కరికీ లేనన్ని
కష్టాల కలగూరగంపలు
నా నెత్తినే ఎందుకు?'
'ఇన్నిన్ని ఇక్కట్ల
చేదూ మాత్రలూ, సమస్యల వగరు గుళికలూ
నాకే ఎందుకు?'

ఈ ప్రశ్నాంకురమే
కాలాంతక కారణం

అది మొక్కై, మానై
మానసాకాశాన్ని ఆక్రమిస్తుంది
ఏ మూలనో మిగిలిన
కించిదాశాభావ కూకటివేరునీ
పెళ్లగిస్తుంది! చీకటి నీడల్ని విస్తరిస్తుంది !

'మాట పడి ఎరగను
నన్నే అంతమాట – అంటాడా?'
ఇతరుల మాటల్ని నీవే పూర్తి చేస్తుంటే?
నీకు నీవే తీర్పరివై ముందుకు ముందుకు దూకితే?
అపార్థం చేసుకున్నాడనే వ్యధ!
రోషం కుములుతుంది
అహం బుసకొడుతుంది
మాటగాలికి పోయింది!
దాన్ని గుండుసూదిని చేసుకోవటం ఎందుకు
గుచ్చుకుని గుచ్చుకుని
గిజగిజలాడటం ఎందుకు?

ముడిపడిన భృకుటి
ఎంతోసేపు అలాగే నిలువదు
అంతలోనో, అంతంతలోనో, ఆపైనో
రంగూ రూపూ చూపూ మార్చుకుంటుంది
'సారీ' చెప్పకపోయినా క్రీగన్ను
చల్లగా స్పృశిస్తుంది కరచాలనం!
కనికరాన్ని కోరే
అవతలివాని స్వయం కృతాపరాధం
చిరు చిరు చిరు నవ్వ
పలకరింపునే పంచుతుంది!

ఈలోగా అంతా
అవ్యక్తవ్యక్త నిరూపణలూ
వ్యక్తావ్యక్త ఆరోపణలూ!

ఎదుటివారితో దగ్గరితనాన్ని పెంచుకుంటే
నీకు నీవెప్పుడూ శూన్యానివి కావు
ఎదుటివారికి నీ ఎరుకని అందిస్తే
అది సంఘటిత స్పర్శ
అది నీ వెతుకులాటకి చివరి చుక్క
అది నీ అంతరాత్మ ప్రాంగణంలోకి
నీదైన సాహసయాత్ర!

## మన భావోద్వేగాలకు మనమే బాధ్యులం

నిరర్థక భావన అలముకుంటే
మనసు–గోడక్కొట్టిన పిడక !
నులక సాగిపోయిన కుక్కి మంచంలో పడక!

డొంకమీది నడక పలు పోకడలు
హఠాత్తుగా చతికిలబడుతుంది

ముందుకు నడిస్తేనే
ఇల్లయినా పొలిమేర అయినా
వెనకబడుతుంది

ఆదివారం తర్వాత సోమవారం
అది వ్యవహారమయం
వ్యాపారమయం,
పూచిన చైతన్యం
నడుస్తున్న సంస్పందనం !

విజేతల స్వగతాలు కూడా
గూళ్లు కట్టబోయినై
భంగపడినై, ఛిద్రమైనై

ధైర్యపు పుడకలూ
ఆత్మస్థైర్యపు పుల్లలూ
అందుకొని
చేయికాలూ ఆడిస్తేనే
గూడు 'కట్టడం';
గుండెని హర్షం తట్టడం!

నచ్చని పనులు చేసే సమయాన్ని
నచ్చిన పనులు చేసే సమయంగా
మార్చుకో గలిగితే – మనసు నిర్మలం!
కదంబ పూబంతిని అందుకున్న ఆహ్లాదం!

అచంచల విశ్వాసం
అది దారిదీపం; అదే చేతికర్ర!
అది జీవన నైపుణ్యాన్ని నేర్పుతుంది
బతుక్కి 'లాలస'ని కూర్చుతుంది

**క్రియాశూన్యత** గట్టు మీది పిచ్చిమొక్క!
వరిచేలో కలుపుమొక్క!
కొండమెట్లపై దొర్లుతున్న చిల్లుబంతి!
'సమస్య' అనుకుంటే
అది నీ 'హస్తగత'మే కావాలి!

నివురుని విసరితేనే జ్వాల
జీవుని వేదన కనలితేనే
గొంతు దాచుకున్న పాటల
మంద్రమంద్ర ప్రస్తారం!

## కలలు కనవద్దు!

**నేల విడిచి సామెందుకూ?**
కలలు కనమన్నారని
కలల్లోనే బతకగలమా?
ప్రపంచ పటంలో భూభాగం చూస్తూ
అదంతా 'నాదే' అనుకోగలమా?

కలలు కంటూ... కంటూ... కం...టుం...టే
అవి కోరిక 'స్థాయి'లోనే
పుబ్బలో పుట్టి మఖలో మాడిపోతూ ఉంటాయి!

అనుకున్నది జరగకపోతే
అంతంత కుంగుబాటా?
ఉద్విగ్నత – ఒక కుతకుత
ఉద్వేగం – ఒక పిల్లికూత
ఉన్మాదం – ఒక పిచ్చిచేత!
క్షణికావేశం ఒక రంగులవల–
ఎరవేసిన గాలం!
అప్రమత్తతే; అనంతమైన ఆత్మవిశ్లేషణే
రహస్య ఛేదనకు సాధనాలు !

'డాలర్ల' రోగగ్రస్తుడికి చికిత్స ఉండదు
'ఇదో 'గడ్డు' సమస్య'
'ఇదో పెద్ద ఆటంకం'
'99'క్లబ్‌లో చేరితే...?
ఆకాశం నుండి
'స్వర్ణ' వర్షాన్ని ఆశిస్తుంటే
గతి–అధోగతే!

## 'నా వల్ల కాదు!'

ఒక నీరస హీనస్వరం
ఒక అసహ్యపు మాట
వినటానికి ఒక ఏవగింపు భావం
ఆ భావన– పిరికితనం పరాకాష్ట
చిత్తడి చిత్తడి చిత్తంలో ఛిద్ర చిత్రం!
పెనం మీద మాడుతున్న జీవనకణం!

పరిష్కారం ఎప్పుడూ
మినుముల రాశిలో కలగలిసిన కందిగింజ
అది ఆ రాశిలో ఎక్కడో ఉన్నది
ఉన్నదాన్ని పట్టుకోవాలి
'అథాతో బ్రహ్మ జిజ్ఞాస....'
వెతుకు... అన్వేషించు...
గాలించు... దొరుకుతుంది...
ఎందుకు దొరకదూ...ఉన్నది కదా మరి!

సమస్య ఏదైనా–'ఐ ఈజ్ ది విలన్' !!
'నాలోనే ఉన్నది– నాతోనే ఉన్నది– అది నా సృజనే!'
ఇదీ తెలివిడి–
గుండె ఖాళీ సంచుల స్టోర్‌రూమ్ కాకూడదు !
కొత్త కుండలో ఆశాజీవనం నింపు !
గాలి బయటకు పోతుంటే
లోపలి కుండ నిండుతూ ఉంటుంది!

ఆలోచనల ఆకాశగంగ
మనోమాలిన్యాన్ని క్షాళనం చేయాలి
భావసమన్వయం
చల్లటి కమ్మని ఆహ్లాదస్పర్శ!

ప్రకృతికి ప్రాణ సంగీతాన్నందించే పక్షి
తన శక్తినీ, ఉనికినీ, కాలాన్నీ, కంఠాన్నీ
చదువుకొనే కూస్తుంది !

మేఘాలతో పాటు
చంద్రుడు పరిగెత్తటం భ్రాంతి
ఈ మూలన నీడపరచుకున్నదంటే
ఆవల ఉన్నదన్నమాట కాంతి!

అప్పుడే పిండిన పాలలోనూ
నెయ్యిని గుర్తుంచుకోవడమే విజ్ఞత!

మోహానికీ మాటకీ ముసుగు లెందుకూ?
అలతి అలతి సహాయాలు, సహానుభూతి,
శాంతి వితరణ, ప్రేమ పంపకం....
చేతికి కర్తృత్వం; మనోధర్మానికి ధన్యత్వం !
సేవాభావం, ప్రేమా,
స్నేహం, వాత్సల్యం
షడ్వికారాల్ని సవరిస్తాయి
అవతలి వారి గుండెలో
అవ్యక్త సంతృప్తిని
జలతారు తెరగా రెపరెపలాడిస్తాయి!

ఫలసిద్ధికి–స్వకార్యం, స్వామికార్యం
సమాంతర రేఖలు కావు
'బతుకు – బతకనివ్వు'కు
అవి వర్ణచిత్రాన్ని కూరుస్తాయి
చూసే చూపుకి ఆహ్లాదాన్ని కూర్చే
శమ దమాల కుంచె అజరామరం!

## నిర్వేదం – అంతర్ 'గతం'

నీతో నీవు బహిరంతర పోరాటం
మానసిక సంఘర్షణా, అపోహల దాడీ
భౌతిక అలసత్వం, వికృత ధోరణీ
'సైకియాట్రిక్ డిజార్డర్స్!'
కనీసం పదిహేను పేర్లు గల పెద్ద సాలెగూడు!

నీ మది నీ జైలుగది
నీ ఘోష – నీ గొంతే దాటని పాట!
నవ్వని వేకువలూ
ఆహ్లాదించని సాయంత్రాలూ
ప్రశాంతినివ్వని రాత్రులూ...
అహరహమూ వడగాలీ
అస్తవ్యస్తపు ఆలోచనల ధూళీ,
అన్ని ఋతువులూ మండువేసవులే!

దుర్వ్యసనాల పుట్టగా మారి
'సైకోసోషల్ మోడల్'గా
కాళ్ళీడుస్తూ, గుడ్లు మిటకరిస్తూ
'బండి' లాగే దుర్దశ ... వద్దు...

తలనొప్పి తనదాకా వస్తే
'పర్లేదు' అనే పెదవి విరుపు–
కొలతలేని, కొలువలేని మూల్యాన్ని కోరుతుంది

చదువు అంటే మార్కులు కాదు
మార్కులంటే ర్యాంకులు కాదు
ర్యాంకులంటే బతుకు కాదు
బతుకు వరం
బతుకు 'స–వరం'
బతుకు దరహాసం
బతుకు సవాలు
బతుకు 'జయంటు వీలు'!
నిలిచి గెలవాలి, గెలిచి నిలవాలి !
ఉత్సాహం, సంతృప్తీ
ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు
ద్వారపాలకులు !

నిష్కల్మషమైన చిరునవ్వు
హృదయ ద్వారానికి పచ్చతోరణం
అది ఆహ్వానిస్తుంది, ఆహ్లాదిస్తుంది
అది స్వాగతిస్తుంది,
మనసా శుభాన్ని 'స్వ'గతిస్తుంది!

వ్యధని భాగించుకుంటూ పోతే
శేషం – శూన్యం
ప్రాణం తెరపిన పడుతుంది !

బాధని గుణించుకుంటూ, సణుక్కుంటుంటే
గుయ్యారపు విషాదం
పర్యవసానం–
కుడి జఠరిక 'కుతకుత' – 'డిస్‌ఫంక్షన్' !
మనసేమో
మల్లె పట్టిన చేనుగా మారుతుంది;
మాటల మూటాముల్లే
'రోగం దొంగ' పాలైపోతాయి!

నిర్వేదం– తికమకపెట్టే ఖేదం
దాన్ని త్యజిస్తే జీవితం పునర్బాల్యం
అమ్మచేతి లాలన!
కరుణామయి చల్లని దీవెన!

## మరపును చెరిపేసే తాళంచెవి కావాలి !

వయస్సు మీరిన వారికైతే
సహజ పరిణామం – అనారోగ్యం
దానిపేరు– 'సెనైల్ డిమెన్షియా!'

ఏడో తరగతి చదువులో
పదిహేడో ఏట పరీక్షలో
ఇరవై ఏడో ఏట ఉద్యోగంలో
అన్నిటా మతిమరపు–
నిస్సందేహంగా రోగమే!

ఇప్పుడే చూసిన పుస్తకం పేరు
ఎక్కడో మనసు 'సిల్‌హౌటీ'లో అస్పష్ట చిత్రం!

చిన్ననాటి పంటకాలవ ఈత
చిక్కగా అల్లుకునే ఉంటుంది!
ఇప్పుడు మాత్రం
అసలు పలుకుకి బదులు వేరే పదం దుముకుతుంది
అసంపూర్తి వాక్యం అధరాల్ని దాటదు
పరాకూ, చిరాకూ..

గాలి పలచబడితే పూవులు రాలవు
ఝుంఝు కొడితే కొమ్మలే విరుగుతాయి!

శారీరకం, మానసికం – బాధావ్యధలు
కందరీగలు కాకూడదు
కలుపుగోలుతనం కళకళలాడిస్తుంది

పోషకాలు లేకుంటే,
దోహదాలు చేయకుంటే
మట్టికీ చెట్టుకూ కూడా చేటే
చేవకీ, జవంకీ, జీవంకీ ప్రమాదమే!
'రెడీమేడ్ ఫుడ్' –
అది ఆరోగ్యంపై విసిరిన పంజా!
మంచి ఒక పాలు; చెడు తొమ్మిది పాళ్లు !

విషయాన్ని బుఱ్ఱలో నాటాలి
తిరిగి తిరిగి పాదుని సరిచేసుకోవాలి
నీరూ, నిద్రా
నిండైన సత్తువని పరిపోషిస్తాయి
అదనపు బలానికి ఆహ్లాదపుటెఱువుని వేసుకోవాలి
ప్రాథమ్యాల్ని కాగితం పైకెక్కిస్తే
నామోషీ ఏం కాదు

జ్ఞాపకం విసురుకోవటానికి
మననం, ధారణ వీవనలు కావాలి!
అభ్యాసంతోనే 'అద్భుతం' ఆవిష్కరిస్తుంది!

ఒక పని, ఒకేసారి, ఒకే సమయంలో,
'ఏకాగ్రత'– అగ్రపూజ్యుని చేస్తుంది!
ఆందోళన, ఒత్తిడి, కూపస్థమండూకత్వం
ఫలితం అధిక బరువు,
ఆపై ఎంత 'బెక'రించినా ఎవ్వరూ వినరు!

దేనికోసమో పరిగెత్తటం
ఎంత పరిగెత్తినా 'పాలు' కనపడవు
ఆరాటానికి చుక్క పెట్టి
పరిమితుల్నీ పటాపంచలు చేస్తే
రాతిలో తేమ చెమ్మగిల్లుతుంది!

చిత్తవైకల్యానికి చికిత్స లేదు
నిరోధమే
ముంగిటి రంగవల్లులతో ముచ్చటింపజేస్తుంది
చలనశీలతే ప్రగతి రేఖల్ని ప్రస్ఫుటింపజేస్తుంది!

## పరాన్నభుక్కు... అవినీతి మేత!

ఖాళీ బుర్రలో
అతి తెలివిని పూరిస్తూ
అన్ని యథార్థాలనీ
మసి పూసిన మారేడు కాయల్ని చేస్తూ
అబద్ధాన్ని జీవన మార్గం చేసేసుకుంటే
'జానెడు పొట్ట' కూడా వికృతంగా తిరగబడుతుంది
'తన కోసమని బుకాయిస్తే
నీ నాలిక కోసేస్తా' నంటుంది!
మోసం చేస్తున్న స్పృహ నశిస్తే
అడుగడుగునా సుడిగుండమే!
ఊబిలో దున్న గతే!

గెలుపు వ్యూహంకోసం
నిజాన్ని, యథార్థాన్ని 'పీ..కే' స్తే
తానే విస్తుపోయే ఛేదకులు ఎదురౌతారు
అన్ని రోజులూ ఒక్కటే కావు! ఒక్కరివీ కావు!

అపరిశుభ్రత కూడా వీటిదికాదు
విరజిమ్మిన మలినానిది
అపవిత్రత నీటిదికాదు
కలగలిపిన కలుషిత భావానిది
సంపదదాహం – చేయిజారిన బంతి
దొర్లుకుంటూ పోయి పోయి అది
'అవినీతి'నే చేరుతుంది – 'శ్లేష్మంలో ఈగతనం'
ఎంతో కొంత అర్థమయ్యే సరికీ –
నిన్నటి ఆర్థికమంత్రి – ఇవ్వాళ జైలుపాలు!

## 'క్షణికోద్రేకం'?

భావోద్వేగాలు
ఏటిలోని కెరటాలు
అవి ఒడ్డున విరిగిపోవాలి
చెలియలికట్ట దాటకూడదు
నచ్చనిదల్లా గచ్చపొదకాదు
విశ్వామిత్ర సృష్టి కాదు
విషవృక్షమూ కాదు
చేదుమందూ కాదు
మెచ్చేదల్లా మేలిమి కాబోదు
మేడిపండు సామెతకు కాలదోషం రాబోదు

బంధం విలువతెలిస్తే
దైహిక ప్రేమ – ఆత్మిక స్నేహాన్నీ విడదీస్తే
హత్యాలేదు, ఆత్మహత్యా రాదు!
వైవిధ్యం ఎంత సహజమో
వైరుధ్యం అంత సహజాతం
ఐదువేళ్ళు – వందేళ్లకు సరిపడా సందేశం
ఎదుటి వారంతా మన ఆలోచనే చేయాలంటే
బతుకు శాశ్వతంగా మోడువారిన చెట్టు!

అసలే అడ్డదిడ్డంగా గోడలూ, విభజన రేఖలూ
ప్రేమరాహిత్యం, కరుణరాహిత్యం
బహిరంతరాల్ని పూర్తిగా ముళ్లమయం చేస్తాయి.
నిన్నటి వర్షాన్ని నిరసించటమెందుకు
ఈ ఉదయం మేడిపట్టు!

కసిలో, కార్పణ్యంలో క్షణక్షణం బతికితే
మేధ కుళ్ళుతుంది దేహం కుష్టుతుంది!
నిన్నటి ఆలోచనా, ఆచరణా
వాడి రాలిన పూలై ఇవాళ వెక్కిరిస్తాయి

'జ్ఞానోదయం'
చిటారు కొమ్మన మిఠాయి పొట్లం కాకూడదు
వర్తమానంలో వాస్తవాధీనరేఖపైనే అందాలి!

ఆకాశాన్ని చూడు
సముద్రాన్ని పాడు

అన్ని ఉద్వేగాలకీ జవాబిస్తాయి
ఆపై అనంతమైన ప్రశాంతి!

ఆత్మస్థైర్యం శబ్దం చేయదు
ఆత్మభీతి శబ్దమే చేస్తుంది!
ప్రేమించటానికి ఒక్కటే జీవితం
జీవించటానికి కూడా ఒక్కటే జీవితం !

### అహం... అది ముచ్చెమటలు పట్టిస్తుంది

అది మూడక్షరాల జబ్బు
ఇంగ్లీషులో 'ఈగో'
తెలుగులో 'అహం'!

ముందంతా అనంతసింధువు కదా!
సముద్రం ఒడ్డున
గులకరాయికెందుకు పొగరు?
అందరికీ దూరం దూరం జరిగి
నిన్ను నీవు శిధిలం చేసుకుని
నడిరోడ్డుమీద నిలబడితే
బొమ్మ విరిచుకొని తిరిగిన రోజులు వెక్కిరిస్తాయి
నీవు విసిరిన మాటల రాళ్లు-
వెనక్కి వచ్చి నీకే తగులుతాయి
ఎన్ని కన్నీళ్లు కార్చినా ఒక్క చుక్కనైనా
ఒడిసిపట్టుకోలేవు !

గలగలల డొల్లతనం కంటే
నిబ్బరం నిరాడంబరత
నిచ్చెనమెట్లెక్కిస్తాయి
ధ్వని కంటే కాంతి వేగంగా ప్రసరిస్తుంది!
అక్షరం - నిజం

ప్రకృతిలో మనిషి
శతకోటి లింగాల్లో బోడిలింగం
సింధువులో బిందువు

చలనశీలంలో సామ్యం
చైతన్యంలో ఋతుస్వామ్యం
సూర్యుడూ, చంద్రుడూ
ప్రకృతి కాసారంలో
మొహం చూసుకొనే అందగాళ్లే !
అన్ని అనుభవాలసారం-
పరిణామ ప్రక్రియ
పుట్టింది నశిస్తుంది
వేదాంతం వైరాగ్యం అనుకోవద్దు
చూపు నిలుపోపుకుంటేనే
సత్యదర్శనం, సమస్పర్శనం!

ఏదీ - ఎక్కడా 'సంపూర్ణం' కాదు
స్వచ్ఛం కాదు, శుభ్రం లేదు
అంతా తెలుపూ కాదు
అంతా నలుపూ కాదు
అంతులేని
ద్వంద్వ సమాసాల చిటితాళం జత!
సృష్టి విలాసం అర్థం పరమార్థం
ఎన్నటికీ అంతు పట్టని లోతు!

అంతా సర్వభ్రష్టత్వమూ లేదు
సర్వతోభద్రమూ కాదు
సర్వ నిర్దోషమూ లేదు
సర్వ సౌభాగ్యమూ కాదు

కనిపించేదంతా కూడా
గడిలోనో నుడిలోనో తప్పున్న ప్రహేళికే
ఎన్ని ఈక్వేషన్స్ వేసి చూసినా
'పూర్ణమిదం పూర్ణమాదాయ పూర్ణాత్
పూర్ణముదచ్యతే'!
అన్నిటా 'హంసపాదు'
యుగలక్షణం
మనసుకు ఉచ్చులు బిగించుకోనక్కర్లేదు
చేతులకు సంకెలలూ అక్కర్లేదు

సందేహం, పరిశీలన
సమాచారం, విశ్లేషణ కావాలి
అవసరం, అనవసరం
వింగడింపు నేర్వాలి...
లో-లోపలికి చూపే జవాబు!

ప్రయత్నం అంతా
'అంతా మన మంచికే' !

సాధించుకున్నది
ఓటి కుండలో నీరు కాకూడదు
వర్ణమాల నేర్చుకోకుండా
వాక్యాలెలా వస్తాయి?!
లక్ష్యసాధన రాజకీయపదవి ఏమీ కాదు
రాత్రికి రాత్రి అర్హత సృష్టించబడదు
అడుగు తర్వాత అడుగు
అటువంటి పురోగతే వికసనంకి శరణాగతి!



### చలన నిశ్చలనం

ప్రశాంతమైన మనస్సే
అన్ని దిక్కుల నుంచీ
స్వచ్ఛభావ పవనాల్ని ఆహ్వానిస్తుంది.

మననధారలో ప్రవహించే
భావనా శుభ్రతే
ఆచరణ హరితానికి అనుకూలిస్తుంది
శక్తి దుర్వినియోగమైనా, గతితప్పినా
ఉపద్రవమే పొరుతుంది
ఉత్తమ ఉపాధ్యాయుడు లేని బడి
అది పాడుబడిన గుడి!

ఉనికే విశ్వమయమైనప్పుడు
వ్యష్టి సమష్టి పరస్పర పూరకాలనే గ్రహింపే
మనుగడని విశ్వాత్మకం చేస్తుంది
విశ్వశ్రేయమే వ్యక్తికి సంపద్యోగమవుతుంది!

జీవితంపై ప్రేమ మాత్రమే
సాధ్యసాఫల్య సిద్ధికి సోపానాల్ని కూరుస్తుంది

అవిశ్రాంతంగా పంచభూతాలు చేసే ఘోష-
శ్రేయస్సూ, ప్రేయస్సే!
ఒకటి క్షేమంకరం, రెండవది సుఖకరం!!

### 'ఒకటి' ఒంటరి అంకె!

ఆశయం - 'ఒకటి'
అందని మానిపండు కాకూడదు
అలాగైతే - 'వ్యక్తి' - 'త్వం' -
పాల సముద్రం ముందు పిల్లి
అమాంతం అంతా తాగేయాలనే ఆబ!

ఆలోచన, దార్శనికత
సమన్వయం, సమరసత
ఆశయ కారకాలు!

ఇవేమీ - - నాటకీయ సంభవాలేం కాదు
సాధనమున సమకూరు లక్ష్య ప్రేరకాలు!

కొత్త సంవత్సరం తీర్మానాలు అన్నీ
కోరికస్థాయి ఫర్మానాలు!
ఆశయం దినచర్యలో భాగమైతేనే
అలవోకగా ఫలసిద్ధి!

'ఎవరి తిండి వారే తినాలి'
నీ కర్తవ్యం బాధ్యత నీదే
'ఎవరికి ఎవరూ సహాయకులు కారు'
ఇలా అనగానే, వినగానే-ప్రశ్నలు వదలకు
భౌతికావసరాలన్నీ అంతరంగతరంగాలే!
నీ కోసం మరొకరు చావరు
ఆరోగ్యానికీ మరణానికీ అప్పులు పుట్టవు!!

### నిత్య నిరంతర సందేశం

గమ్యం నీది - నడక నీది -
మిట్టపల్లాల్ని గమనించు
అవకాశాన్ని 'గుర్తు' పెట్టుకుంటేనే లక్ష్య నిర్దేశం
నీ అనుభవం నీదే; ఎదురుదెబ్బల్ని సహించాలి
నీ ప్రతిరోధాన్ని నీవే ఎదుర్కోవాలి
సహనమే ఏకైక తోడుదీపం !

శక్తి, యుక్తి, వికసనంపై అనురక్తి

అన్నిటినీ కలిపి కదిలిస్తే సంకల్పం
అది సగం బలం మాత్రమే కాదు
అది చోదకశక్తి, అది కనిపించని చెర్నాకోల!
అది మూర్తీభవించిన ప్రోత్సాహం
అది నిదురించని నిండు గోదావరి

అది అలసత్వానికి నిర్లిప్తతకు
అరివీరభయంకరరూపం
తెరవని తలుపుల్ని తెరిపించే పనిమంతతనం

నీమీది అనవసరపు బరువుని
నిష్కర్షగా లాగి విసిరేసే నీ శ్రేయోభిలాషి!

### 'క్రియ'

ప్రక్రియావరణం సమస్తమూ - **క్రియాచరణమే!**
విత్తుకీ చెట్టుకీ
మొగ్గకీ పువ్వుకీ
పిందెకీ కాయకీ
ప్రాధాన్య క్రమం - ప్రకృతి వరం !

ప్రతి పనికీ అన్వయించే వికాస ప్రక్రియ
తరం తరం నిరంతరం... వాస్తవం...

నిర్వ్యాపరత్వం కాపురుషలక్షణం
జడత్వానికి జెండాలు పట్టరు
శవానికి ఎన్ని ఊరేగింపులైనా
ముగింపు ఖననమో, దహనమో!
సకిలింతలతో గుఱ్ఱం జవం కొలవరు
గట్టున పాఠం ఈత నేర్పదు
పెనం మీద వేగిన గింజ విత్తనం కాబోదు
తాడుమీద ఆరవేయని తడి బట్టలు ఎండవు

ఎగిరేపిట్టా, కదిలే పులుగూ కూడా
బతుకు పోరులో గెలవాలంటే
వ్యాపకంతో వ్యాప్తి చెందాల్సిందే
సవాళ్లకు ఎదురీది విస్తరించాల్సిందే!

'పేథాస్' ఫ్యాషన్ పదం
నిస్పృహ అయినా... నిరాశ అయినా
విరక్తి... ఆత్మ దైన్యం
నెఱ్ఱెలు విచ్చిన మట్టి బెడ్డలే!
ఆశ చినుకూ, ధైర్యం వర్షం తగిలితేనే
బతుకు మట్టి పరిమళించేది!

రోజూ చచ్చేవాడికి
ఏడ్చే వాడుండడు, ఎవడి ఏడుపు వాడిదే
లోకం సంతలో అమ్ముడుపోనిదంతా...
'డంపింగ్ యార్డ్'కే!

గతం గాయాలు సలుపుతాయి
రాతిమీది ఉలిదెబ్బలు అవి
అవి అవిరామంగా మననంలో
నిట్టాడిగూడులు కాకూడదు
రూపాంతరం చెందిన కర్తవ్యాన్నివ్వాలి!
కర్మాంతరం చెందిన ప్రవాహినీ వ్యాఖ్యలు కావాలి!

పనిచేయటమంటే
శ్వాస నిశ్వాసలు!
ముల్లు గుచ్చుకున్నా
ఆయాసం వచ్చినా, దారి తెలియకున్నా
నడకకి అక్కడ చుక్క పెడతామా
ఆగు, చూడు... నడు...!
రెక్క మానులుంటాయి
నీకు దిక్కున్న చోటేదో నీకే తెలియాలి
ఆ వైపుకు చూపూ, నడకా
నీవే నిర్ణయించుకోవాలి
నీ ముందడుగులోనే నీ జీవితం పుష్పించాలి
నీ పూనికలోనే నీ పురోగమనం పల్లవించాలి!

అన్ని రంగాల్లో - గెలుపుకి
స్వీయావిష్కరణం
వేకువరేకుల స్ఫాటిక సాధనం!
ఆలోచించకుండా పని చేయటం
పని చేయకుండా ఆలోచిస్తూనే ఉండటం
... తప్పు ఒక పుట మాత్రమే
చైతన్యం ఒక మంచి పుస్తకం!
దీపం నోరు పెకల్చదు
వెలుగుతో పరిచయం చేసుకొంటుంది
విజేత విధానమూ ఇదే
విజయం సహనాన్ని వాంఛిస్తుంది
నిరంతర శ్రమని ప్రేమిస్తుంది
శ్వాసలో ఆశ నిలిచి ఉండటమే ప్రాణశక్తి
చైతన్యం ఎప్పుడూ ఒంటరిది కాదు!

ఎంతదూరమైనా వెళ్ళడం
అది సాహసం, పిక్కబలం
ఎంతదాకా వెళ్లాలో తెలియడం
అది వివేకం, లక్ష్యజ్ఞానం
జ్ఞానం మాట్లాడుతుంది
తెలివి వింటుంది

బొగ్గునైనా, బంగారాన్నైనా....
సాధించాలంటే తప్పదు అసలైన సాహసయాత్ర
ఎన్నెన్నో పొరల్ని తవ్వుకుంటూ పోవాలి
ఎన్నెన్నో తెరల్ని తొలగించుకుంటూ పోవాలి!

నీ ప్రతిబింబంతో నీవు ప్రేమలో పడకు
అది పైపై అందాన్ని ఆహ్లాదపరుస్తుంది
ఆత్మముగ్ధత్వం అసలు తత్వాన్ని చెప్పదు !

### పని 'లో' విద్యుత్ ప్రసారాలు!

కార్యశీలికి అన్నపానాలు-
**క్రమశిక్షణా, నిబద్ధతా**

క్రమశిక్షణంటే
కఠినత్వమూ కాదు, నిరంకుశత్వమూ కాదు
అదొక జీవన విధానం
పూవు విచ్చుకొనే క్రమం
కాయ పండుగా మారే విభ్రమం
మనోధర్మ ప్రతిఫలనం

నిబద్ధత-
బద్ధకానికి బద్ధశత్రువు
పునశ్చరణ- మంచీచెడూ బేరీజు
చేసినదీ చేయవలసినదీ తెలిపే తరాజు!

మంటమీది భాండీని అలాగే వదిలేస్తే
పదార్థం మాడి మసైపోతుంది!

మనిషి పలచనౌతుంటే
నియమోల్లంఘన దౌష్ట్యంగా చిక్కబడుతుంది
నిగ్రహం- హెచ్చరికల 'సిగ్నల్ లైటు' !

ఆకర్షణల, వ్యామోహాల
పరిహరణ కాలకృత్యం కావాలి
అమృతభాండం చేతిలో ఉన్నా
'రుచి'ని ఆశించని గరుడుని జిహ్వదే
కర్తవ్యస్పృహ, కార్యదీక్ష,
క్రమశిక్షణా, నిబద్ధతా !!

పనిమంతుడి ఆశయం, కర్తవ్యం
అది తాను 'ఎక్కగలిగే' చెట్టు
కార్యదీక్ష
కాళ్ళ కండరాల్నీ నరాల్నీ బలపరిచే సత్తువ !

పనిమంతుడి లక్ష్యం
అందుకోగల పండు
సోమరిపోతు - 'ఆశ' క్షితిజరేఖ!
వట్టిగొడ్డుకు అరుపులెక్కువ !

పని చేయడమంటే-
చైతన్యాన్ని తట్టిలేపడమే

పనిచేయడమంటే

క్షణక్షణం జీవించడమే
జీవించడంలోకి ప్రవహించడమే

పనిచేయడమంటే
చెరగని చిరునవ్వు కోసం
ఒక రసమయ కవితావాక్యం కోసం
ప్రతి-పద, పదార్థ అన్వేషణే!
పనిచేయడమంటే చలనాన్ని
అనుభూతిప్రదం చేసే సందేశం!
అది ఆత్మీయ సూక్తికి
రుచిరార్థాల వరుస కూర్పు!

### సారపు ధర్మం

'తత్వమసి' 'అహం బ్రహ్మాస్మి'...
మహావాక్యాలు...
ఇంకా.. ఇంకా...
ఆధ్యాత్మికం ఆత్మజ్ఞానం
సంకీర్ణాన్ని, సంక్లిష్టతల్ని
మాటల్లో దొర్లుపుచ్చకాయల్ని చేస్తే....చేసుకుంటూ
పోతే...
అర్థం, ఆంతర్యం
అనంతాకాశానికెక్కుతాయి !

మాట నేలపై మొలకెత్తాలి
మాటకీ మట్టికీ
అనుబంధం ఆచరణలో పటిష్టం కావాలి!
'మనిషి' మీది విశ్వాసం
జీవనశైలిలో సేవాతత్పరత-
మానవతా తరువు హసించే శుభప్రసూనాలు!

మంచి మాటకి నోరు రాక
మంచి చేతకి చేయీ రాక
మంచివైపు కదిలేందుకు కాలూ రాక
కుదేలయితే... ఆ మనిషం 'మనిషి'?-
'ఎత్తునపడ్డ పుల్లావు'!
ఎత్తిపోతకు కల్లాపి!

### మసకలేని సత్యం

ఉత్పత్తి-అస్తిత్వం
వృద్ధి-విపరిణామం
అపక్షయం - వినాశనం
మనిషి బతుకు ఆరుదశల్నీ అనుభవించక తప్పదు
అన్ని దశల తరణానికీ
అనేకానేక బోధ(న)ల అంతస్సారం... కర్మాచరణే!
చీమనేర్పే గుణపాఠమే 'చేవ'
చేసి చూపించమంటుంది అంతస్సత్త్వం
ధైర్యే... సాహసే...
ఒకటి లక్ష్యం, మరొకటి మనోబలం
ఒకటి నిర్ణయం, మరొకటి నిమగ్నత
మరి.... 'లక్ష్మి'?
అదే ఫలసిద్ధి
కాయ చిట్లితేనే గింజదొరికేది!

ఎంతటి మహత్తర కావ్యానికైనా
అక్షరసముదాయపు సమన్వయమే

ఆముఖం, శ్రీముఖం!
ఎంతటి మహోన్నత నిర్మాణానికైనా
శంకుస్థాపన లక్ష్యశుద్ధి
పునాది కార్యదీక్ష
కార్యదక్షతే కట్టుబడి, పెట్టుబడి!
ఇదీ సాధనక్రమం! నిర్మాణ విక్రమం!

### అందరితో మనం... మనతో అందరూ

విశ్వం వాంఛిస్తుంది
'గిర' లో పలుకు భేదాన్ని కాదు
నాభినుండి మ్రోగే నాదాన్ని!
'విరుపు'ల వెకిలిని కాదు
మొగ్గల్ని వికసింపజేసే తెమ్మెరసోనల్ని!

బోలుమాటలూ, వంకర మొహమాటలూ
దుష్ట గాలిలో తేలుతూనే ఉంటాయి
అవి భవితలో దుమ్మూధూళిని పోస్తాయి!

నిర్మలమైన సంభాషణ, నిశ్చయమైన చర్చ
పరిహార్యం కావు
పరిపరి పరిచయాలూ హర్షనీయమే
వదరు వమనమే అనారోగ్యం
మదపు వాసనే పనికి రానిది
'కుందేలు కాలు' 'తీర్పు'లే 'పనికి' కానివి!

### ముఖయోగం

**అమ్మ నేర్పే తొలివిద్య నవ్వేకదూ**
బుగ్గలు పుణుకుతుంది,
చిటికేస్తుంది, 'చి...చ్...చీ...' అంటుంది
ముద్దులు వర్షిస్తుంది, మురిపాలు కురిపిస్తుంది
ముసిముసి నవ్వు, మురిపెపునవ్వు
మందహాసం, దరహాసం
బోళానవ్వు, భళభళా నవ్వు
గలగలానవ్వు, ధళధళా నవ్వు!

అన్ని... అన్ని... నేర్చుకుని...
అన్నీ మరచిపోతే -
'ఒక్కమనిషీ నవ్వడేం?' అన్న వ్యధ సలుపుతుంది
ఆరోగ్యానికీ ఆయుస్సుకీ
అనుసంధానం నవ్వే కదూ!

నిముషం సేపు మనసారా నవ్వుకుంటే చాలు
అది 24 గంటలపాటు
వ్యాధినిరోధకశక్తిని ప్రచోదనం చేస్తుంది
వట్టి గాలికబుర్లకి పుట్టెడు చెడుబుద్ధులు!

నవ్వు - నాణ్యం, విన్నాణం
'గెలటాలజీ' చదివితే తెలుస్తుంది
నవ్వు ముఖం నలుగురితో మనసునీ కలుపుతుంది
పదుగురి పరిచయంలో
'ఏకం'గానూ నిలుపుతుంది!
శుభోదయంలో వ్యాయామం
పసిపాపనవ్వులో సంగీతం
రోజంతా ఆలాపన...
రాగం... తానం... పల్లవి... ఆపై 'చరణం'-
జీవంజీవ జీవనాచరణం!

### కాలం అందరికీ సమానం

కాలస్పృహ... కాల నియతి
సమయగతి అవగాహన
రోగశంకల్నీ, మృత్యు భయాన్నీ
ఎదుర్కొనే సాధనాలు
బతుకు తిమిరంతో సమరానికి ఆయుధాలు
పుట్టుక... చలనం... గమనం... పయనం...
కించిత్ వ్యవధీ... ముగింపూ
ఏ ఒక్కరికో మాత్రమే వర్తించే సహజాతాలు కావు
దూసుకువచ్చే కెరటం ఆగమంటే ఆగదు!

'అన్నీ నేనే చేయాలి'-ఆలోచనే అరిష్టదాయకం
'కాలమూ- పని' ని విస్మరిస్తే
ఫలసాయం తాలూతప్పా
శక్తికీ యుక్తికీ పరిమితులుంటాయి!
వేనవేలు తేనెటీగల సమష్టియే 'తేనెపట్టు' !
గుండె ఒక్కటే, మెదడూ ఒక్కటే
గుర్తింపు లేకుంటే ఇక్కట్లే
అరలున్నాయి గదా అని
'అర' మరకలు చేసుకోకూడదు

నిద్ర - భౌతికావసరం, శరీరధర్మం
నిర్నిద్ర అంటే ముగింపుని
ముందుకు తెచ్చుకోవటమే !

కాలం ప్రవహించే విద్యుత్తు
పారే తీగెనుండి లాగీ, ఆపీ గుప్పిట పట్టలేం
'ఊపిరి సలపటానికీ 'టైమ్' లేదంటే
నిన్ను నీవు 'ఖర్చు' చేసుకుంటున్నట్టే!

మహాబలవంతుల్నీ
అధికసంపన్నుల్నీ, మహారాజుల్నీ
తనలో కలిపేసుకుంటుంది - కాలం
అది 'అ- త్రిగుణం' 'అ-వ్యుచ్ఛిన్నం'
వేదాంతమేమీ కాదు-వాస్తవం!

ప్రాధాన్య క్రమం; ప్రాముఖ్య ప్రకరణం
గుప్పిట్లో క్షణాలకి 'విలువ' నిస్తాయి
మరచిపోతే -
అమవస చీకటి అడవిపాటలా విస్తరిస్తుంది!

ఎప్పటిపని అప్పుడు
ప్రణాళికే ప్రయోజనకరం
లక్ష్యం దినచర్యలో భాగం కావాలి
సమయ నిర్దేశం చుక్కాని కావాలి
అప్పుడే అవాంతరాలకీ
ఓ 'లెక్క'నీయగలం!
కాలంతో కలిసి నడవటం-
చైతన్య జీవన సందేశం!
ఆరోగ్యాన్ని 'ఖర్మ' కొదిలేస్తే
ఆపైన - దినం దినం- దినదిన గండం !
బతుకంతా ఆసుపత్రి పాలు!

### బిందువులో సింధువు - మనోబలం

విశ్వం లోపల - 64 పార్శ్వాలు -
ప్రతి ఒక్కటీ ప్రిదిలి-మళ్లీ
అనేకానేక పార్శ్వాలయ్యాయి
మనకు గోచరమయ్యేవి మూడే-

కొంచెం లభించింది
మరి కొంచెం కావాలి,
మరికొంచెం లభించింది
ఇంకొంచెం కావాలి!
సర్వమూ పోతే
కొంచెం... స్వల్పం....
'అల్పం'గానైనా చాలు!

ఏదో మంత్రదండం దొరకాలనీ
ఎవరో అక్షయపాత్రని
అప్పనంగా అప్పగించాలనీ...'దురాశ'!
ఆ ఆశ విస్తీర్ణం 'మేర' లేనిది!

మనసు బలహీనమైతే-సంఘటనే సమస్య
మనసు స్థిరమైతే - సంఘటన సవాలు
మనసు శక్తివంతమైతే-
అవకాశం, సంభవం, సాధన,
...అంతా మనోమయ క్రీడ!
లోలోపలి గుప్తధనం
సంకల్పబలం...
దాని ఎరుకే జ్ఞానం
దాని అమలే ప్రజ్ఞానం
'ప్రజ్ఞానం బ్రహ్మ'!

### మలిన క్షాళనం నీ కర్తవ్యం

ధ్వనిగా మ్రోగాలి
ప్రతిధ్వనిగా వికటంగా కాదు
స్వరంగా రాగించాలి
అపస్వరంగా గీరించటం,
కాదు, కికురించటమూ కాదు

గళంగా నిగళించాలి
విగళంగా పగులువారటం కాదు
నిలువునా నిలువెత్తునా
ధ్వని సింధువై అలలెత్తాలి
మాటా, చేతా, చేష్టా
నడకా, నడతా-
పున్నమి చంద్రకాంతి
స్పష్టంగా, ప్రస్ఫుటంగా...
ఆకుపచ్చటాకుల ఎదల్ని
చల్లగా స్పర్శించాలి

'సెల్ఫ్ పోర్ట్రెయిట్'
నీ బొమ్మను నీవే చిత్రించుకోగలగాలి
అది సమృద్ధిగా
'నిన్ను'కు అద్దం పడుతుంది-
వంకరటింకరల్ని వోరగంట చూసి,
సిగ్గు మరచిపోయి
జ్ఞాపకాల గీతల్నీ, ఆంతర్యాల గీరల్నీ
వొక్కింత సవరించుకోవచ్చు -
'సరి' చేసుకోవచ్చు
అప్పుడే మలినక్షాళనకు అవకాశం -

వర్షంలో చెట్టులా !

### విచ్ఛిత్తుల్ని చిత్తుచేస్తూ...

మనః ప్రవృత్తే
అంటుకున్న మరక

అది చెరిగిపోదు
ఎంత కడిగినా, ఎంత తుడిచినా
తరిగిపోదు
వేదాంతమూ అదే
వేదనాంతరమూ అదే

పొరలు పొరలుగా...
పోయినా... అక్కడికే

ఈషణ త్రయం వదిలితేగానీ
ఋణత్రయమైనా
దుర్గుణ వర్గమైనా
వదలవు : సాలీడు గతి!

దమం, శమం
హఠంతో రావు, మఠంలో లేవు

నిబద్ధతలో, నిమగ్నతలో, నిబిడతలో
శుద్ధ చిత్తం నిలిస్తేనే
తోడుదీపం దొరుకుతుంది

గదిమూల చీకటి పొద్దులో
ఏ కిరణజన్య స్పర్శకూ
అవకాశం లేదు
ఇంత 'తెలివిడి' ఎండపొడో
కాసింత 'సమభావన' వెన్నెల చారికో
ప్రస్తారం కావలసిందే!
రవ్వంత కారుణ్యం
గోరంత దాక్షిణ్యం
అణువంత అనురాగం
ఆదాన ప్రదానాలు కావలసిందే!

వీటిముందే అన్ని విచ్ఛిత్తులూ
చిత్తు చిత్తు!!

### సంక్లిష్టతలో స్పష్టత

**నిక్కంగా జీవించటమంటే**
అప్పుడే వికసించిన చేమంతి కావటం
మంచు బిందువుల్ని సేవించిన
నందివర్ధనం కావటం
శాంతిని వర్షించటం
ప్రశాంతిని వరించటం!

నిక్కంగా జీవించటమంటే
ప్లాస్టిక్ ముళ్లతీగల నుండి దూరమవటం
రహదారుల వలయాల
రక్తచారికల నుండి
నిన్ను నీవు పదిలపరచుకోవటం!

నిక్కంగా జీవించడమంటే
గాలిలో ధూళిలో
నీటిలో నిప్పులో
క్షణాలలో, పదాలలో
నిండి నిబిడీకృతమైపోయిన
సకల కాలుష్యాల
వికృత వికటత్వ
పర్యవసానాలనుండి
నీ ఆరోగ్యాన్ని నీవు కాపాడుకోవటం!

నిక్కంగా జీవించడమంటే
ఆనాటి కత్తి పడవల్ని
వాన చినుకుల జాలులో వదిలి
కేరింతలాడటం!

నిక్కంగా జీవించడమంటే
నిస్స్వార్థానురాగ
స్ఫాటికపథాల గమించటం
నలుగురితో కలిసి
ప్రశాంతాహారాన్ని పంచుకుతినటం
భవిష్యత్తుని
వ్యాకోచింపజేసుకోవడం
విస్తృతం చేసుకోవడం
వైవిధ్యం చేకూర్చుకోవడం
భవితవ్యానికి
వెలుగు తోరణాల్ని సమకూర్చుకోవడం!

నిక్కంగా జీవించడమంటే
'అంత' 'అంతంత'గా ఉంటే
'ఇంత' 'ఇంతింత' గా బతకగలగటం
'ఆత్మతృప్తి' అనే అన్నీ ఉన్న విస్తరి'వై ఉండటం,
గూటిలో ఒదిగే గువ్వని
'రోల్‌మోడల్'గా
మననం చేసుకుంటూ,
'నీవు' ఆ గువ్వవై పోవటం!

### సృజన నిత్యహరితం

దేహం-వైయుక్తికం
మనసు-ఆత్మీయం
ఆత్మ-కళ

సృజనకు ఆధారభూమికలు -
మేధ, విలువలు
నైతికత అంతస్సూత్రం; తెగిపోకూడదు

సృజనకు శత్రువు భయం
అన్ని సంపదలూ, కళలూ,
విజ్ఞానం, శాస్త్రం, సాంకేతికత
సర్వం-సృజనశక్తి ఆవిష్కారాలు

భయం రోగ లక్షణాలు
'అధికారం', 'మామూలు',
'ఆధిక్యత' 'నత్త' నడక, నిబంధన, 'ఎఱ్ఱటేపు'
ఇదంతా - వాపు,
బలుపు కాదు!

తాగివచ్చిన ప్రియుడు
భార్యకెప్పుడూ భయంకరుడే!

తుప్పు పట్టిన గొట్టం నుంచీ
నీళ్లతోపాటు
మాలిన్యమూ కలిసేవస్తుంది
ఈల కూడా వినిపిస్తుంది
స్నానపు సంతోషం

(మిగతా 8వ పేజీలో)

## స్త్రీలపై జరిగే ఆకృత్యాలపై ఎలుగెత్తిన స్వరం “సృష్టికేతనం”



ఫిబ్రవరి 26వ తేదీ బుధవారం శైలజామిత్ర రచించిన దీర్ఘ కవిత “సృష్టికేతనం” ఆవిష్కరణ సభలో తమిరిశ జానకి, స్వాతి శ్రీపాద,శీల సుభద్రాదేవి, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥ ఎన్.గోపి, శైలజామిత్ర, సుధామ, కళా జనార్ధనమూర్తి, శిష్టా మాధవి

స్త్రీల పట్ల పురుషుల ప్రవర్తనలో మార్పు రావాలని బలంగా ప్రతిపాదించి, శైలజామిత్ర తన దీర్ఘకవితలో తమ రచనా విశిష్టతను చాటుకున్నారని ప్రముఖ కవి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి అన్నారు. మహిత సాహితి, త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం (ఫిబ్రవరి 26వ తేదీ)



కవయిత్రి శైలజామిత్రను సత్కరిస్తున్న అతిథులు

సాయంత్రం, ప్రముఖ కవయిత్రి శైలజామిత్ర రచించిన “సృష్టికేతనం” దీర్ఘకవిత ఆవిష్కరణ సభ జరిగింది. సభకు ముఖ్యఅతిథి, ఆవిష్కర్తగా విచ్చేసిన ఆచార్య ఎన్. గోపి ఆ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అకృత్యాలు, అన్యాయాలపై, పురుషుల దురహంకారాలపై శైలజామిత్ర ఆగ్రహంతో రచించిన దీర్ఘకవిత నేటి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేసారు. ఆడపిల్లలు వద్దనే సమాజంలోనే వయసుతో నిమిత్తం లేకుండా ఆడవారిపై జరుగుతున్న లైంగిక దాడులు పురుషాధిపత్యానికి పరాకాష్ట అని, ఇంటా, బయటా మహిళలకు భద్రత లేని సమాజ గమనంపై శైలజామిత్ర ధర్మాగ్రహం ఈ కావ్యంలో అభివ్యక్తమైనదని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు సుధామ మాట్లాడుతూ శైలజామిత్ర ఆగ్రహంలో న్యాయం ఉందని, నేడు సమాజపు తీరులో మార్పు రావాలని చేసే ప్రయత్నంలో ఆవెం కృతకృత్యులయ్యారని తెలిపారు. నేడు టీవీ చూసినా, పేపర్ తిరగేసినా మొదటగా కనిపించేవి ఈ వార్తలేనని ఆవేదన వ్యక్తం చేసారు. మహిళాదినోత్సవ సందర్భంగా ఈ గ్రంథం రావడం ఎంతో సముచితంగా ఉందని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథిగా పాల్గొన్న త్యాగరాయగానసభ అధ్యక్షులు, శ్రీ కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ తమ ఆవరణలన్నీ సాహిత్యానికే ప్రాముఖ్యత నిస్తానని, ఎంతో మంది ప్రముఖ, ప్రఖ్యాత కవులు, రచయితల కోసమే ఈ గానసభ పెద్ద పీట వేస్తుందని తెలిపారు. విశిష్ట అతిథి గా పాల్గొన్న నేటినిజం సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు బైస దేవదాసు మాట్లాడుతూ దాదాపు పది కవితా గ్రంథాలు రచించిన శైలజామిత్రకు ఈ కవితా సంపుటి 11వ దని, నేటినిజజం పత్రికలోనే దాదాపు 450 సమీక్షలు రచించారని, తద్వారా అనేక గ్రంథాలను చదివిన వారయ్యారని తెలిపారు. ప్రస్తుత గ్రంథం “సృష్టికేతనం” లో నేటి సమాజ చిత్రాన్ని ఆవిష్కరించారని, వరసలు మరచి ప్రవర్తిస్తున్న పురుషుల వైచిత్రిని ఒక రకంగా స్కానింగ్ చేసారని తెలిపారు. సమాజాన్ని సరిచేసే క్రమంలో ఇలాంటి గ్రంథాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. మరో విశిష్ట అతిథి, ప్రముఖ కవయిత్రి శీలా సుభద్రాదేవి మాట్లాడుతూ శైలజామిత్ర తన దీర్ఘకవితలో మొదటి లైన్ నుండి చివరి వాక్యం వరకు ఎక్కడా తగ్గకుండా, ఎక్కకుండా సమానమైన స్వరాన్ని వినిపించారని, శైలజామిత్ర రచనల్లో తాత్వికత కనిపిస్తుందని అభిప్రాయబడ్డారు. ఈ దీర్ఘకవితకు రెండవ భాగాన్ని కూడా రచించాలని సూచించారు.

గ్రంథ సమీక్షకురాలు ప్రముఖ కవయిత్రి స్వాతి శ్రీపాద మాట్లాడుతూ ఈ గ్రంథం ఒక విధంగా సమాజానికి వేసిన సూటి ప్రశ్న అని తెలిపారు. సమాజంలోని స్త్రీల పరిస్థితిని, దయనీయ స్థితిని కళ్ళకు కట్టినట్లు తెలిపారని అన్నారు. అభినందనలు తెలిపిన ప్రముఖ రచయిత్రి తమిరిశ జానకి మాట్లాడుతూ.. శైలజామిత్ర రచనల్లో ఎంతో విశిష్టత ఉందని, వీరు మరిన్ని గ్రంథాలు రచించి ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశీర్వదించారు. ఆవిష్కరణకు ముందు శిష్టా మాధవి ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవయిత్రులు అరుణ నారదభట్ల, ఉమాదేవి కల్వకోట, కుసుమా ఉప్పలపాటి, తమిరిశ జానకి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ రచయిత్రి కస్తూరి అలివేణి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు.

(5వ పేజీ తరువాయి...)

విచారపు ఆవిరైపోతుంది

సృజనకారునిదెప్పుడూ
సత్యరూపం, సత్యవాదం,
సత్యశోధనం, సత్య ప్రకటనం!

చెప్పే మాటా
చేసే పనీ
నీకు తృప్తీ,
ఇతరులకు ప్రయోజనం కలిగిస్తేనే
దూదీదారం అవుతాయి
మట్టి పూవుకూ
మంచుబిందువుకూ బంధం
సమన్వయ గంధమే!

## గీత దాటొద్దు

**ఆత్మగౌరవం–**
అది సామర్థ్యానికి
అనులోమంగా లభించేది
చిరునవ్వుకు కానుకగా అందేది
కృతజ్ఞతకు ప్రతిస్పందనగా పొందేది

ఆత్మగౌరవం
స్వీయావిష్కరణం
అది వేయి విజయాలకు జెండాకర్ర
వినయం దాని పునాది

సామాజిక స్థాయినీ,
మానసిక ప్రేరణనీ
పాతాళంలో పడేసుకుంటే
పరులకు వెలుగేం అందుతుంది?

జ్ఞానం – విజ్ఞానం – ప్రజ్ఞానం
ఉన్నంతలో పంచుతూ
సౌశీల్యాన్ని హర్షించాలి
మనసునీ మనిషినీ
పడుగు పేకల్ని చేయాలి
ఆ నేతగాని నైపుణ్యం
ఆత్మగౌరవానికి మరో మెట్టు

'వల్లకాని'దానికి
డొల్ల హామీల రంగులేస్తే
మొహం పాలిపోతుంది
అసలురంగు వెలిసిపోతుంది

'ఎస్‌బాస్'! ఎప్పటికైనా క్రీనీడలో
'డూ డూ' బసవన్న!
మెరమెచ్చులూ, ఇచ్చకాలూ
అన్నివేళలా సాయంపట్టి గట్టెక్కించవు
ఆత్మస్తుతి అయినా పరప్రశంస అయినా
డబ్బాల్లో గులకరాళ్ళే!

వస్తు నాణ్యతే
వస్తువు 'అసలు' విలువని నిర్ణయిస్తుంది!
నిన్నటి కంటే మెరుగైన పనితనమే
కన్నవారినీ, విన్నవారినీ
ఔనన్నవారినీ సంతృప్తుల్ని చేస్తుంది

మొక్క ఎదుగుతుందంటేనే
విరి హాసం వెలుగు వెల్లువౌతుంది!

ఇతరుల మీద ఆధారపడటం
ఇరుకులో ఇరుక్కుపోవటమే
కాలూ చెయ్యీ ఆడుతున్నవాడికి
లోకం చేయి విదల్చదు
హీనత్వాన్ని ఈసడిస్తూ ఉంటుంది
నిన్న రాలిన పువ్వుకి
చిన్న చూపు తప్పదు!

## పతాకశోభ

ఆత్మోన్నత్యం
ఆధారభూమిక
జ్ఞాన వితరణ
నైపుణ్య నిరూపణ
ఎదుటివారిని సన్నిహితం చేస్తుంది
పూచిన తరువు దరికే
చేరుతారు పుష్పలావికలు!

నీవు నీవుగా నిలవటం
ఎంతెంతగా అవసరమో
నీ శక్తియుక్తుల ప్రకటనం
అంతంత ఆవశ్యకం
చదువుకోవటానికి పనికిరాని
కార్బన్ కాపీ చెత్తబుట్టపాలు!
విత్తు తలయెత్తితేనే
ఉనికికి స్థితీ, గతీ, ఉన్నతీ!

నిన్ను గౌరవించేవారిని కించపరిస్తే
మనసుల మధ్య అఘాతం
వినయంతో అవుననటం
విశ్వాస సృష్టికృతి!

మానవ సంబంధాలు పరీక్ష కాదు
పాసో, ఫెయిలో తేల్చుకోవటానికి

మానవ సంబంధాలేమీ
పోరాటం, పోటీకావు
గెలుపు ఓటములు పిలుచుకోవటానికి
మానవ సంబంధాలంటే
మనం మనంగా ఉండటం
మనవారనుకున్న వారిని వారుగా

## మననీయటం

మానవ సంబంధాలంటే
సరసమైన సమాసోక్తి!!
సమాజ సమన్వయశక్తి!!

వినాశనం మూలం భయం
ఆత్మోన్నత్యానికి అది సుప్తావస్థ
అలనాటి కథల్లోని
పాత్రలన్నీ నీలోనే నిక్షిప్తం
నిద్రలేపితేనే స్థైర్యం, ధైర్యం

భయపడితే
బాహ్యంలోని నిర్ణయాలు
నీ కోరిక మేరకు పరిగెత్తుకురావు
'అనివార్యం' అయితే ఆపేదేం ఉంది?

'కుందేలుకి మూడేకాళ్లు' తత్త్వం
స్థిరపడితే–
బుద్ధి కార్యకారణాల్ని పక్కన పెడుతుంది
కీడెంచి ఎంచి –
భయాన్ని కొండని చేస్తుంది
'ఖర్మ'నే అండను చేస్తుంది
ఇక మిగిలేదంతా
చీకటి గుహలో పులివేట!

ఆత్మోన్నత్యం
ఆకాశం నుంచీ రాలిపడదు
అలాగని
హఠాత్తుగా తగిలే 'లాటరీ' కూడా కాదు

అది సాధన
ఆత్మోన్నత్యం
పగిలిపోతే పనికిరాని
అందమైన ఫ్రేములోని అద్దం!
అనవరతం భద్రంగా చూసుకోవాలి!
ఆత్మోన్నత్య పాలన అంటే
కుడిఎడమల స్వయం విశ్లేషణ!
ఆత్మోన్నత్య సేవనం జీవధర్మ పరిరక్షణ!

## 'దీపం– జ్యోతి'

'వ్యక్తిత్వ వికాసం'
వాచాదోషమై పోయింది
బోలుమాటా, డొల్లమాటా అయింది
దాని అసలు సాధన
విజయానికి మెట్లో పట్లో కాదు
'పట్టు' పరిశ్రమో 'పెట్టు' విక్రయమో కాదు
'బట్టీ'ల శ్రమ అంతకన్నా కాదు
డాలర్ల పంటకి బుర్రలో వంటా కాదు
పదిమందిలో నుంచీ విడివడిపోయి
స్వప్రయోజనం నిచ్చెనపైకి
'ఏకం'గా త్వరత్వరగా ఎగబాకటం కాదు
కుహనా విలువల పరిధిమీద
తాకిన బిందువునే
మళ్లీ మళ్లీ తన్నుకుంటూ పోతూ.. పోతూ..
ఉండే
పరుగు... పరుగు... మరియు పరుగు కాదు
లౌక్య లౌకిక వృత్యానువ్యవహారం కానే కాదు
'వ్యక్తి'–'త్వం'– 'వికసనం' ఇది
బతుక్కి అర్థం జిగీష
బతుకు పరమార్థం విచికిత్స!

'వ్యక్తి'–'త్వం'–'వికసనం' అంటే
ఎత్తుపల్లాల్ని చూసి– ఆగి– నడిచే ప్రక్రియ
ఛాతీమీద గర్వంగా దాల్చే పతాకచిహ్నం
తానే దీపంగా మారి
తనలో కీలనీ, జ్యోతినీ ఆవిష్కరించుకొనే
'ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్' సూక్తిఫలం!
ఒక దీపం– ఎన్నెన్నో దీపాల్ని
వెలిగించేందుకు – 'వ్యక్తి'–'త్వం'–
ఏక హారతి కావాలి!
అదే 'వికసనం'!

## సౌమనస్యం

'నేను' ఎప్పుడూ
'అహం' నే వినిపిస్తుంది
'మేము' అనుకోగానే
అందరితో 'సహ' అనిపిస్తుంది

కొత్తగా పుట్టిన దూడను
తల్లి పశువు ప్రేమించటం మనమూ నేర్వాలి

సహృదయత, ఏకమనస్కత
ద్వేషరాహిత్యం–
మనిషంటే వీటి మూర్తిమత్వం కదూ!

పుత్రుడంటే
దేహమానస ప్రయుక్తితో
తండ్రిని
అనుసరించేవాడు, వినిపించేవాడు
తల్లితో కనిపించేవాడు
సోదరీ సోదరులు–'తో'బుట్టువు'లు

పుట్టుకలో ద్వేషం లేదు,
ఆ తర్వాత
కొత్తగా ఆ అంగీని తొడుక్కోవడం ఎందుకు ?
కందిరీగ ఊహలు కాలుష్యపు ప్రవాహాలు!

కుటుంబం ఒంటరి అంకె కాదు
బహుళత్వపు కోవెల
ప్రేమవనం, మమతాధనం!

ఐకమత్యం తెగకూడని సూత్రం
కలసి మెలసి మాట్లాడటం
కలసి మెలసి జీవించటం
కలసి మెలసి నవ్వటం
కలసి మెలసి భుజించటం
ఉమ్మడితనం !
ప్రేమే 'కలివిడి'తనానికి ఆలంబనం
ప్రేమను ఇచ్చి పుచ్చుకోవటం అంటే
సాత్విక, ధార్మిక, మానవతా దృక్పథాల
ఒప్పుకోలు!
ఆకులు ఎన్నయినా
చక్రపు మధ్య బిందువు వద్దనే కేంద్రీకరిస్తాయి
ఏకాభిప్రాయం (మనస్సు)
ఏకోన్ముఖత్వం, (దృష్టి)
ఏకాగ్రత (లక్ష్యశుద్ధి)
ఐక్య కార్యోన్ముఖత్వం (సాధన)
'సమాజ' సారళ్యానికీ
సంఘటిత శాంతికీ ఇవే పునాదిరాళ్లు!

సంకల్పం
భావన
చింతన
క్రియ
వాక్యం అనుసరణంలో పద 'బంధాలు' అయితే
సామరస్యం కలిసి వరిస్తుంది
శ్రేయస్సు విరిసి హసిస్తుంది!

## ఇతివృత్త సాంద్రత

మార్గదర్శకులు
రెక్కమానుల వంటివారు
అనుభవాల్ని 'రుచి' చూపి

'అభిరుచి' ని ప్రోదిచేస్తారు
చెలమను చూపించగలరుగానీ
నీరు తాగించ(లేరు) కదా!
పరిష్కారాల ఉదాహరణలిచ్చి
సమస్యల చిక్కు దారపుటుండల్ని
విప్పుకోమంటారు
నిర్ణయం నీది;
ఉంటే గింటే– దానిని తెల్లారనీయకూడదు!
'సరిదిద్దటం కాదు, సరిదిద్దుకోవటం'
నేర్వమంటారు; కావాలంటే
అందులోనూ 'రీమేక్' లని
ఆలోచించుకోమంటారు

స్వామి ముందరవేసినసాంబ్రాణిలా
స్వాంతమంతా
'ఆనోభద్రాః క్రతవోయన్తు విశ్వతః'
నిబిడమై, పర్యాప్తమై, నిండుగా
ప్రశాంతమవ్వాలి!
మనిషి దేనిని గురించి
ఉపాసిస్తాడో
అదే అవుతాడు మరి!

సత్యం– శ్రేయస్సు– సౌందర్యం
జ్ఞానం – కర్మ– భక్తి
సిద్ధాంతాలూ సూత్రాలూ కావు
సాధించుకోవలసిన సమన్వయార్హతలు!

'సామాజిక న్యాయం'
ఇవ్వాళ ఏ వీరుడో
కనిపెట్టింది కాదు
'సర్వే భవంతు సుఖినః సర్వేసంతు నిరామయః
సర్వేభద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖ
భాగ్భవేత్!'
ఈ మననధార – ప్రవాహినీ వ్యాఖ్యగా
అణువణువునా నిండి
ఆహ్లాదాచరణగా పరిణమిస్తే
అదే – అదే – అసలు – సిసలు
వ్యక్తి నిర్మాణం
'వ్యక్తి' – 'త్వం' – 'వికసనం' !




## అనంతమూ... చిరంతనమూ...

ఆదీ – అంతమూ – రెండూ
'నేను'లోనే.... జలతరంగిణి!
ఏ మరకైనా, మెరుపైనా
సర్వభ్రష్టత్వమైనా, సర్వతోభద్రమైనా
'వ్యక్తి' ! --- 'త్వం' !
వర్ణచిత్రంలో చిత్రవర్ణాలన్నీ
'నీవే', మరియూ 'నీవియే'!

ఆనువంశికం
నైజం
స్వయంకృతం –
మూడు పదార్థాలూ కలిస్తే
మనిషి బొమ్మ – 'వ్యక్తిత్వం'!
వీటిలో –
ఒకటికి ప్రమేయసూత్రాలు వేలవేల హెచ్చరికలు
అవి నీ చేతిలో లేనివి
రెండూ, మూడూ – –
కేంద్రం, అర్థవ్యాసం, వ్యాసం, పరిధీ
అన్నింటి పరిరక్షణ, పరిపోషణ 'నీ' స్వకీయం
అందుకనే
'చైతన్యం' వ్యష్టి, జీవనం సమష్టి
ఈ రెండింటికీ మధ్య వ్యత్యస్తాలూ, విపర్యయాలూ
ఏవీలేవు
ఇదేమీ వచోవిఘాతమూ కాదు
సంపూర్ణ సత్యభాషణం !
నీవు నీవే, నీవు సమాజ జీవివే!

ఆచరణ సమస్తమూ స్వయంకృతం
మనో బుద్ధ్యహంకార నియంత్రణం
అస్తిత్వ చైతన్య ప్రస్ఫుటనం
సత్యసంశుద్ధే ఒడ్డున పడేస్తుంది...

సమన్వయం, సామరస్యం
శాంతిస్థాపన, శ్రీరాగాలాపన – సకలమూ
అందని మ్రానిపండ్లేమీ కావు
అరచేతిలో ఉసిరికలే!

'బ్రతుకు' 'బ్రతికించు' 'బ్రతకనివ్వు' సూత్రం
త్రికరణశుద్ధి ఆచరణే ఉన్నత వ్యక్తిత్వం !
అందరికోసం తానైన లక్ష్యసాధకుడే
సమాజ పురోగమన శక్తి
అతడే – అతడే – ఉత్తమ వ్యక్తి !!

'వికసనం' అంటే
విశ్వ దీర్ఘకవితా రాగానికి శ్రుతి కూర్చటం
వికసనం అంటే
విశ్వవిపుల వనహాసానికి లయ నేర్పటం !!

'వ్యక్తీ'....!
'వికసనం' అంటే
సమూహాల్లోని ఒంటరికి,
సమూహం పక్కకి నెట్టిన ఏకాకికి
దైవీగుణ సంపదని పంపకం చేయటం!
తప్పిపోయిన మనుషుల్ని
వెతికిపట్టుకుని పెంపకం చేయటం!!

# ప్రస్తుత పరిస్థితులకు అవసరమైన సినిమా.... "స్క్రీన్ ప్లే" of an indian love story

ఒక మార్పుకు నాంది పలుకుతూ... పసి మొగ్గల నుంచి పండు ముదుసలురవరకు మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు, అత్యాచారాలకు నిరసనగా "స్క్రీన్ ప్లే" an indian love atory అనే ట్యాగ్ తో కె.ఎల్.ప్రసాద్ రచించి , దర్శకత్వం వహించి, స్వయంగా నటించిన సినీమా మార్చి 6 న దేశవ్యాప్తంగా విడుదలవుతుంది.

ఆ సినిమాను అక్షరయాన్ కవయిత్రులకు ప్రివ్యూ LV.Prasad film lab లో చూపించారు.

తెలుగు సినిమా రంగంలో ఇదొక కొత్త ఒరవడి. కొత్త మలుపు.

రచన,దర్శకత్వం కే .ఎల్. ప్రసాద్ గారు సంగీతం యం.యం.శ్రీలేఖ, రాజేష్ ఫణి ఎడిటింగ్. సినిమాటోగ్రఫీ యం.వి.రఘు గారు. ప్రొడ్యూసర్ శ్రీమతి డా కె .అరుణ కుమారి గారు. నేషనల్ డ్రామా థియేటర్ లో శిక్షణ పొందిన కుమారి ప్రగతి యాదాటి, విక్రమ్ శివ లు హీరో హీరోయిన్ లు గా నటించారు.

కె.ఎల్. ప్రసాద్.. A man of reality అనిపించింది. ఒరిస్సాలో ఇంజనీరింగ్ చేసి సినిమా మాధ్యమం ద్వారా తన బనీఇతిజీశ్రీ జీలిజీతీవనివబబ నీ చూపిద్దామనుకున్న వ్యక్తి, తెలుగు యూనివర్సిటీ విజిటింగ్ ఫాకల్టీ గా ఉంటూ అంతా కొత్తవాళ్లతో వారి లోని నైపుణ్యాలను మెరుగు పెడుతూ, ఈ సినిమాను మహా గొప్పగా నిర్మించారు. రెండేళ్ళ క్రిందట లేడీ బర్గ్ వాడిన మంబుల్ కోర్స్ అనే " స్క్రీన్ ప్లే" ని ఈ సినిమాకి వాడడం జరిగింది .

కొన్ని వేల వేల సినిమాలని చూసిన ప్రేక్షకులకు ఈ సినిమా చూపించడం, ఒప్పించడం గొప్ప విషయం. థియేటర్ వరకు వెళ్లిన ప్రేక్షకులు ఎవ్వరూ ఈ సినిమాను మెచ్చుకోకుండా ఉండలేరు. ప్రస్తుత సమాజం లో జరుగుతున్న హీనమైన అత్యాచారాలను, ఒళ్ళు గగ్గుర్పొడిచే సంఘటనలకు తల్లడిల్లిపోతున్న సమస్త జనుల కంఠస్వరాన్ని హీరోయిన్ వాయిస్ ద్వారా సమర్థవంతంగా చెప్పించారు దర్శకులు.

ఆదర్శవాది అయిన తన స్నేహితుడిని ఇష్టపడి, ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఒక అమ్మాయి తీరా కాలం తో బాటుగా మారిపోయి ఒక కమర్షియల్ డైరెక్టర్ గా మారిపోయిన తన భర్తను ఆమె ఎలా రిసీవ్ చేసుకుంది. అడుగడుగునా అమ్మాయిలపైన జరుగుతున్న లైంగిక దాడులతో మానసిక సంతులనాన్ని కోల్పోయిన తన స్థితి ఏమైంది, అసలు ఈ సమస్యకు మూలమేంటి, పరిస్థితుల ప్రాబల్యమేంటి, ఎలా ముగింపు ఇచ్చారు అన్నది అద్భుతం.

మరీ ముఖ్యంగా సెకండ్ ఆఫ్ లో జరిగే మలుపులు ఊహకందనివి. ఇంటర్వెల్ బ్రేక్ తరువాత వచ్చే పాత్ర సినిమాకు ప్రాణ ప్రతిష్ట చేస్తాడు. ఒక జంట వారి మధ్యన




వచ్చిన గ్యాప్, బయట జరుగుతున్న అత్యాచారాలకు స్పందించి friction కు గురైన భార్య emotional imbalcing.. ఇలా sensibility తో సాగే సందేశాత్మకమైన సినిమా ఇది.

సినిమా ఒక శక్తివంతమైన మాధ్యమం. దీనిద్వారా ఇప్పుడు ఆడవారి పైన జరుగుతున్న అత్యాచారాలను చాలా చాలా బాగా చెప్పారు. ఇలాంటి థీమ్ ఉన్న సినిమాలు ఇప్పుడు నిజంగా అవసరం. కమర్షియల్ అస్పెక్ట్ తోని మాత్రమే సినిమాలు వస్తున్న ఈ రోజుల్లో ఎ. ఒ.ప్రసాద్ గారి లాంటి దర్శకులు అవసరం ఎంతైనా ఉంది.

అలనాటి మేటి నటీమణులను గుర్తుకుతెచ్చేలా నటించిన కుమారి ప్రగతి యాదాటి శబ్బాష్ అనిపించుకుంటుంది.

ఆమె నటన హైలైట్. She is a great performer. హీరో కూడా ఒక ప్రేమైక మూర్తి గా సమయోచితమైన నటనను ప్రదర్శించాడు.

ఎలాంటి శబ్దకాలుష్యాలు లేకుండా మనసుకు చెవులకు కూడా ఇంపుగా ఉండే సంగీతాన్ని "చావైనా.... బతుకైనా " అనే పాట ద్వారా ఎం. ఎం. శ్రీలేఖ గారు అందించారు. సీనియర్ సినిమాటోగ్రఫేర్ శ్రీ రఘుగారు ఈ సినిమాకు మరో అండ అనొచ్చు. ఈ సినిమా మానవత్వమున్న మనుషులందరూ చూడాలి. అందరినీ చూసేలా చేయాలి. Its a message and thought proviking move of contemporary issues.

**–రమాదేవి కులకర్ణి**
8985613123

## సాహితీకిరణం పదకొండవ వార్షికోత్సవం సందర్భంగా

డా॥పట్టాభి కళాపీఠము సౌజన్యంతో కవితలపోటీ

**బహుమతులు మొత్తం రూ॥5 000/–**:5 సమాన బహుమతులు 1)కవిత ఏ అంశానికైనా చెందినదై ఉండవచ్చు. కవిత20 లైన్లకు తగ్గకుండా 30 లైన్లకు మించకుండా వుండాలి. కవిత పంపేకవరు మీద సాహితీకిరణం పదకొండవ వార్షికోత్సవ కవితల పోటీకి అని స్పష్టంగా రాయాలి.కవితను ఎ4 సైజు పేపర్ ఒకేవైపు రాయాలి. జిరాక్స్ కాపీలు, చిత్తుకాగితాలమీద వ్రాసిన కవితలు స్వీకరించబడవు2)కవిత దేనికీ అనుకరణ/ అనువాదం/అనుసరణ కాదనీ ఇంతకు ముందెక్కడా ప్రచురితం/ప్రసారితం కాలేదని, ఏ బ్లాగులో/వెబ్‌సైట్‌లో పెట్టలేదని హామీపత్రం ఇవ్వాలి. 3)నిర్ణీత నిడివికి మించిన కవితలు ఉత్తమంగా వున్నా పరిశీలించబడవు. 4)ఒకరు ఎన్ని కవితలైనా పంపవచ్చును. అయితే మాకు ఉత్తమంగా తోచిన కవితను మాత్రమే న్యాయనిర్ణేతకు పరిశీలనకొరకు పంపబడును. 5)కవి/కవయిత్రి పేరు, చిరునామా, వగైరా కవిత ఉన్న పేపరుమీద కాక హామీ పత్రంపై రాయాలి. 6)హామీ పత్రంపై కవిత శీర్షికను తప్పకుండా రాయాలి. 7)ఇంతకుముందు సాహితీకిరణం పోటీలకు పంపగా బహుమతి పొందని రచనలను తిరిగి పంపరాదు. 8)బహుమతి ప్రదానోత్సవం 11.06.2020న హైదరాబాద్‌లోని కళానుబ్బారావు కళావేదికలో జరుగుతుంది. 9)విజేతలు స్వయంగా వచ్చి బహుమతి తీసుకోవలెను. 10)కవితలు పోస్టు/కొరియర్ ద్వారా మాత్రమే 30.04.2020వ తేదీలోగా అందేటట్లు ఈ చిరునామాకు పంపాలి. సంపాదకులు సాహితీకిరణం, ఇ.నెం.11 -13-154,అలకాపురి, రోడ్. నెం.3, హైదరాబాద్ - 500 102, ఫోన్:040-29550181

## బంగారు లేడి!

మనసొక్కటే కాదు
కాలంకూడ రెక్కల్లేని మాయ పక్షే!
రెప్పపాటులో ముల్లోకాల తీర్థయాత్ర
ఇందుగలదందు లేదనే సందేహంలేదు
ఘడియలో కోట్లాది జనం
గుండె చప్పుళ్ళని రికార్డు చేస్తుంది
ప్రతి విఘడియ ఎవరెక్కడున్నది ఎవరేం చేస్తున్నది
దాని వేలి చివరంచుల మీదే!
రైళ్లరాక సోకల్ని విమానాల విహాయత యానాన్ని
కరెన్సీనోట్ల కాయకల్ప చికిత్సల్ని
ఆకాశవాణి విస్తంత్రీనాదాల్ని
చుక్కల్ని చుక్కల కదలికల్ని
తుఫానుల్ని తుఫానుల మాయ లాంతర్లని
'క్షణ శత' సహస్రంలో వీక్షించే విశ్వచక్షువు
కాలమే యంత్రమైపోయింది
కాలమే ప్రగతిమంత్రమైపోయింది
యంత్రంలోంచి మీటల్లోకి
మీటల నుండి వేళ్ళలోకి
వేళ్ళనుండి గాల్లోకి
తన్నుతాను నియంత్రించుకుంటూ
తనే అన్నింటికీ ఆద్యంతమవుతూ
నీ భరితఖండంలో కాలం డిజిటల్ వేది
అన్నీ తానై అన్నింటాతానై
ప్రపంచ దేశాల వైజ్ఞానికోద్యమ సంరంభంలో
ఉపగ్రహమై
గగనతలంలో పరుగుదీస్తున్న
బంగారు లేడి!



**– గుర్రాల రమణయ్య**
సెల్: 996321943

## డా॥ పాలకోడేటి అప్పారావు స్మారక ద్వితీయ కథానికల పోటీ 2020

గత సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా ఉగాది సందర్భంగా కథానికల పోటీ నిర్వహించడానికి ఎం.వి.ఆర్. ఫౌండేషన్ నిర్ణయించింది. క్రింం సంవత్సరం విజేతలకు అందించిన బహుమతి మొత్తం ఆరువేల రూపాయల మొత్తం పదివేలుగా పెంచుతూ మొదటి బహుమతి ఐదు వేలుగాను, రెండవ బహుమతి మూడు వేలుగాను, మూడవ బహుమతి రెండు వేలుగాను నిర్ణయించడమైనది. కావును రచయితలూ/రచయిత్రులు తమ కథానికలు ఎనిమిది పేజీలకు (పేజీకి ఒకవైపు మాత్రమే) మించకుండా సామాజిక ఇతివృత్తంతో రాసి హామీ పత్రాన్ని జతచేసి ఈ క్రింది చిరునామాకు పంపగలరు. చిరునామా: ఎం.వి.ఆర్. ఫౌండేషన్, బి–474, ఎజి కాలనీ, యుసుఫ్‌గూడ పోస్ట్, హైదరాబాద్–45.

**కథానికలు అందవలసిన చివరి తేది:25–3–2020.**

బహుమతులను ఏప్రిల్ 15న శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే కార్యక్రమంలో ప్రకటించి అందచేయబడును. రచయితలందరూ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరడమైనది.

## పుడమి తనయుడు??

అవును అతను అవని బిడ్డే....
రేయి పగలు
కష్ట పడుతూనే ఉంటాడు...
చిత్త కార్తె ఎండల్లో
చెమటను లెక్క చేయక...
వణికించే చలిలోనూ
చలిమంటలతో సేదతీరక...
కుండపోత వర్షంలో
గొడుగులో తలదాచుకోక...
అతను కష్ట పడుతూనే ఉంటాడు...

పచ్చని పైరులను చూసి
పరవశించే పసిబాలుడతడు...
అమ్మ మేనిపై పచ్చని చీరను
బహూకరించే నేతగాడతడు...
అమ్మ శిగలో పూలుతురిమినట్లు
పూలతోటలేసి మురిసిపోయే
భూమి తనయుడతడు...

ఆది నుంచి దళారుల చేతుల్లో
పదే పదే మోసపోతున్నా
అమ్మనొదిలి పెట్టి వెళ్ళలేక
అప్పు చేసి మరీ అమ్మ మేనిపై
పచ్చని చీరను నేస్తూనే ఉంటాడు...

ప్రభుత్వాలు పట్టించుకోకున్నా
ప్రకృతి కన్నెర్ర చేసినా
తన కన్నీళ్ళతో పొలం తడిపి
పూల తోటలతో అమ్మ శిగలో
పూలు తురిమే
పుడమి తనయుడతడు...!!



**–శాంతి కృష్ణ**
9502236670



అంతర్జాతీయ మాతృ భాషాదినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో ఫిబ్రవరి 22న మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రముఖ కవయిత్రి విశైకను సత్కరిస్తున్న అతిథులు వై.యస్.ఆర్. మూర్తి, జి. వెంకటరెడ్డి, అర్చన, రఘుశ్రీ తదితరులు.

## ఆహ్వానం

### గుర్రాల రమణమ్మ స్మారక సాహితీ అవార్డులసభ-2020

గుర్రాల రమణయ్య **జి.ఆర్.ట్రస్ట్** ఆధ్వర్యాన జరుగు కార్యక్రమం



శ్రీమతి గుర్రాల రమణమ్మ

తేది 15-3-2020
ఆదివారం
సమయం :
ఉదయం 10 గం॥లకు
వేదిక :
ఐ.యం.ఎ. హాలు
నెల్లూరు.

**అవార్డుల గ్రహీతలు**

- **శ్రీ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి** అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం.
- **శ్రీ రావి రంగారావు,** ప్రముఖ కవి, గుంటూరు.
- **శ్రీ గుడిబండి వెంకటరెడ్డి** జి.వి.ఆర్. ఆరాధన సమితి అధ్యక్షులు, హైదరాబాద్.
- **శ్రీ బైస దేవదాస్,** నేటినిజం సంపాదకులు, హైదరాబాద్.
- **డా॥ యస్. గురుప్రసాద్,** M.D.D.M. కార్డియాలజిస్ట్, చెన్నై.
- **డా॥ షేక్ మస్తాన్ బాషా** M.S. ఆర్థో, అసిస్టెంట్ ప్రొఫెసర్, A.C.S.R. Medical College, Nellore.
- **డా॥ జి. మురళీధర్,** ప్రముఖ మానసిక వైద్యులు, నెల్లూరు.
- **శ్రీ కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి** ప్రముఖ కవి, చిత్రకారుడు, కనిగిరి.
- **శ్రీ కోసూరి రత్నం,** సంపాదకులు, విశాలాక్షి సాహిత్యమాసపత్రిక, నెల్లూరు.
- **శ్రీమతి యం.బి.డి. శ్యామల** ఆం.ప్ర. సాంఘీక సంక్షేమ గురుకులం, తాడికొండ, గుంటూరు జిల్లా.
- **శ్రీమతి మందరపు హైమావతి** ప్రముఖ కవయిత్రి, విజయవాడ
- **శ్రీ శాంతికృష్ణ,** ప్రముఖ విశ్లేషకులు, కవయిత్రి, నెల్లూరు.

అందరూ ఆహ్వానితులే

డాక్టర్ జి. మురళీధర్ - స్మితి
కార్యదర్శి
ప్రముఖ మానసిక వైద్యులు, నెల్లూరు.
సెల్: 9866125869

గుర్రాల రమణయ్య
అధ్యక్షులు
జి.ఆర్.ట్రస్ట్, నెల్లూరు.
సెల్: 9963921943

ఆహ్వానించువారు :
డా॥ జి. మురళీధర్ - స్మితి జి. ప్రభాకర్ - జ్యోతి
గాదిరాజు భాస్కర్ - అరుణ గురిజాల సురేష్ - సుజన

## ఆహ్వానము

### మధురపద్యాలు

జక్కాపూర్ బడిపిల్లల కవితలు

**పుస్తకావిష్కరణ సభ**



తేది : 12-03-2020 గురువారం, ఉ॥గం॥ 11-30 ని॥ లకు
వేదిక : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, జక్కాపూర్.

| | |
|---|---|
| సభాధ్యక్షులు : | శ్రీ రాళ్ళబండి వద్మయ్య గారు ప్రధానోపాధ్యాయులు, జి.ప.ఉ.పా. జక్కాపూర్ |
| ముఖ్య అతిథి (ఆవిష్కర్త): | శ్రీ బైస దేవదాస్ గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక |
| విశిష్ట అతిథులు : | శ్రీ దుర్గం వర్శరాములు గారు గ్రామ సర్పంచ్ జక్కాపూర్ |
| : | శ్రీ మాడుగుల మురళీధరశర్మ గారు యం.పి.డి.ఓ., నారాయణరావుపేట |
| గౌరవ అతిథులు : | శ్రీ కొమురవెల్లి అంజయ్య గారు సభ్యులు, తెలంగాణ మీడియా అకాడమి |
| : | శ్రీ కలకుంట్ల రంగాచారి గారు అధ్యక్షులు, TUWJ సిద్దిపేట జిల్లా |
| | శ్రీ సత్తు యాదవరెడ్డి గారు MEO, నారాయణరావుపేట |
| తొలిప్రతి స్వీకర్త : | శ్రీ తోట మధుసూదన్ గారు పుస్తక వదాన్యులు |
| ఆత్మీయ అతిథులు : | శ్రీ గోపాలపురం భానుచందర్ గారు MPTC జక్కాపూర్ |
| | శ్రీ పల్లె కనకాంబరం గారు ఉప సర్పంచ్, జక్కాపూర్ |
| | శ్రీ కోడి రమేష్ గారు SMC చైర్మన్ |
| | శ్రీ ముదిగంటి రవీందర్ రెడ్డి గారు గణిత ఉపాధ్యాయులు |
| సభాసమన్వయం : | శ్రీ బైతి దుర్గయ్య గారు సంపాదకులు, మధురపద్యాలు |

ఆహ్వానించువారు :
ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, SMC & విద్యార్థులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జక్కాపూర్,
మం॥ నారాయణరావుపేట, జి॥ సిద్దిపేట. (తెలంగాణ)

## ఆహ్వానం

### శ్రీ త్యాగరాయగానసభ నిర్వహణలో

(ప్రపంచ రికార్డులు పొందిన సంస్థ ) రి.నెం.103/1967

ఎందరో మహానుభావుల మధుర స్మృతులతో...
ప్రముఖ స్వరకర్త శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు గారి జయంతి
సంగీత కార్యక్రమం

తేది: 06.03. 2020 సా॥6.00 గం॥లకు వేదిక: కళా లలిత కళావేదిక (ఏసి)

ముఖ్య అతిథి : శ్రీ దేవులపల్లి ప్రభాకర రావు – తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు
సభాధ్యక్షులు : శ్రీ కళా వి.ఎస్. జనార్దన్ మూర్తి – అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
విశిష్ట అతిథి : శ్రీ రమణ వెలమకన్ని – ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథి : శ్రీ వై. సుబ్రహ్మణ్యం – బృందావనం వ్యవస్థాపకులు

365 రోజులు ఉచితం

శ్రీమతి కళా శారదాదీక్షితులు
ప్రధానకార్యదర్శి
శ్రీ త్యాగరాయగానసభ

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.